



మాడుగుల అగ్నిమాపక కేంద్ర భవనం సన్‌షేడ్ పెచ్చులూడి బయటకు కనిపిస్తున్న ఇనుప ఊచలు



శిథిలమైన ఆర్‌అండ్‌బి క్వార్టర్ భవనంలో ఏర్పాటు చేసిన సబ్బవరం అగ్నిమాపక కేంద్రం

అచేతనంగా.. అగ్నిమాపక కేంద్రాలు

ఆంధ్రజ్యోతి పరిశీలన

జిల్లాలో 24 మండలాలు.. ఉన్నది ఎనిమిది ఫైర్ స్టేషన్లు

- నర్సీపట్నం పరిధిలో రెండు జిల్లాలు, తొమ్మిది మండలాలు
- బోర్లు లేని రావికమతం, మాడుగుల, నక్కపల్లి
- నీటి కోసం గెడ్డలు, వాగులు, వ్యవసాయ బావులే దిక్కు
- పరాయి పంచన సబ్బవరం కేంద్రం
- అనకాపల్లి మినహా మిగిలిన అన్నిచోట్ల ఒక్కొక్క శకటం
- పలు కేంద్రాల్లో సిబ్బంది కొరత
- కొత్త ఫైర్ స్టేషన్ల ఏర్పాటుపై తీవ్ర జాప్యం



జిల్లా అగ్నిమాపక కేంద్ర కార్యాలయం

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

జిల్లాలో అగ్నిమాపక కేంద్రాలు అచేతన స్థితిలో ఉన్నాయి. కొత్త అగ్నిమాపక కేంద్రాల ఏర్పాటు ప్రతిపాదనలు ఏళ్ల తరబడి అమలుకు నోచుకోకపోవడం లేదు. ప్రస్తుతం వున్న కేంద్రాల్లో పూర్తిస్థాయిలో సిబ్బంది లేరు. జిల్లా కేంద్రం మినహా మిగిలినచోట్ల ఒక్కో అగ్నిమాపక శకటం మాత్రమే వుంది. ఈ కేంద్రం పరిధిలో ఒకేసారి వేర్వేరుచోట్ల అగ్నిప్రమాదాలు జరిగితే సకాలంలో మంటలను ఆదుపుచేయని పరిస్థితి ఏర్పడుతున్నది. జిల్లాల పునర్విభజన తరువాత ఏర్పడిన అనకాపల్లి జిల్లాలో అగ్నిమాపక శాఖ జిల్లా అధికారి కార్యాలయాన్ని ఏర్పాటు చేయడం మినహా గతంలో ఉన్న అగ్నిమాపక కేంద్రాలకు ఎటువంటి అదనపు వసతులు, సౌకర్యాలు కల్పించలేదు. నిబంధనల ప్రకారం 50 వేల మంది జనాభాకు, ప్రతి 20 కిలోమీటర్ల పరిధిలో ఒక అగ్నిమాపక కేంద్రం వుండాలి. ఈ ప్రకారం జిల్లాలో కనీసం మండలానికి ఒకటి చొప్పున అగ్నిమాపక కేంద్రాలు అవసరం. కానీ ప్రస్తుతం ఎనిమిదిచోట్ల (వీటిలో రెండింటిని ప్రైవేటు ఏజెన్సీలు నిర్వహిస్తున్నాయి) మాత్రమే ఫైర్ స్టేషన్లు వున్నాయి. సబ్బవరం కేంద్రానికి సొంత భవనం లేదు. మిగిలిన కేంద్రాలకు సొంత భవనాలున్నా సిబ్బంది లేమి, వసతుల కొరత వేధిస్తున్నాయి. ప్రతి కేంద్రంలో కనీసం 15 మంది సిబ్బంది వుండాలి. కానీ అన్నిచోట్ల పది మంది లోపే ఉన్నారు. ఖాళీ పోస్టులు ఏళ్ల తరబడి భర్తీకి నోచుకోకపోవడంతో ఉన్న సిబ్బందిపై పనిభారం పెరుగుతున్నది. వేసవిలో సెలవులు తీసుకునే పరిస్థితి లేదు.

అగ్నిమాపక కేంద్రం లేని పారిశ్రామిక ప్రాంతాలు

జిల్లాలోని అచ్యుతాపురం, రాంబిల్లి, పరవాడ మండలాల్లో వివిధ రకాల పరిశ్రమలు, ఫార్మా కంపెనీలు వున్నాయి. వీటిల్లో తరచూ ... మిగతా 8వ పేజీలో

ఉన్న సిబ్బందితోనే మెరుగైన సేవలు



అగ్నిమాపక కేంద్రాల్లో సిబ్బంది కొరత ఉన్నమాట వాస్తవమే. అయినప్పటికీ అందుబాటులో ఉన్న సిబ్బందిని వినియోగించుకొని అగ్ని ప్రమాదాలను అరికట్టడానికి శక్తివంచన లేకుండా సేవలు అందిస్తున్నాం. జిల్లాలో అదనంగా అగ్నిమాపక కేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం.

ఆర్.వెంకటరమణ,
అగ్నిమాపక శాఖ జిల్లా అధికారి

మాడుగులలో సిబ్బంది కొరత

మాడుగుల రూరల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి):
స్థానిక అగ్నిమాపక కేంద్రం పరిధిలో మాడుగుల మండలం పూర్తిగా, చీడికాడ మండలంలో కొన్ని గ్రామాలు ఉన్నాయి. బోరు వున్నప్పటికీ నీరు సరిగా రాదు. దీంతో సమీపంలోని తాచేరు నది, ఆరు కిలోమీటర్ల దూరంలో వాడపాడు వద్ద పెద్దేరు నదిలో నుంచి నీటిని నింపుకుంటున్నారు. అధికారి, సిబ్బంది కలిపి మొత్తం 16 మంది వుండాలి. కానీ ప్రస్తుతం ఒక లీడింగ్ ఫైర్‌మన్, ఒక డ్రైవర్, ఏడు ఫైర్‌మెన్ పోస్టులు ఖాళీగా వున్నాయి. భవనంలో సన్‌షేడ్ పెచ్చులూడి ఇనుప ఊచలు బయటికి కనిపిస్తూ ఎప్పుడు కూలిపోతుందో తెలియని స్థితిలో ఉంది. ఫైర్ ఆఫీసర్ గదిలో కిటకీలకు తలుపులు లేవు. మరుగు దొడ్డికి తలుపులు లేవు.

ఎక్కువ పరిధితో ఇబ్బందులు



అనకాపల్లి కేంద్రంలో నిరుపయోగంగా ఉన్న బుల్లెట్ వాహనం

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి):
స్థానిక అగ్నిమాపక కేంద్రం పరిధిలో అనకాపల్లి పట్టణం, మండలం, కశింకోట, మునగపాక, పరవాడ మండలాలు వున్నాయి. జిల్లా కేంద్రం ఏర్పాటు కాకముందు ఒక అగ్నిమాపక శకటం మాత్రమే వుండేది. కొత్త జిల్లాల ఏర్పాటు విశాఖ నుంచి మరో అగ్నిమాపక శకటాన్ని ఇక్కడకు పంపారు. కాగా 2013లో ఈ కేంద్రానికి బుల్లెట్ వాహనం మంజూరైంది. దీనికి గ్యాస్, ఫోమ్ సిలిండర్లు వుంటాయి. అగ్నిమాపక శకటాలు వెళ్లలేని చిన్నపాటి వీధుల్లోకి బుల్లెట్ ద్వారా వెళ్లి అగ్నిప్రమాదాలు నివారించే వారు. అయతే నిర్వహణ లేకపోవడంతో నిరుపయోగంగా మారింది. కాగా అగ్నిమాపక కేంద్రంలో పూర్తిస్థాయిలో సిబ్బంది వున్నారు. ఈ కేంద్రం పరిధి అధికంగా వుండడంతో శివారు ప్రాంతాల్లో అగ్నిప్రమాదాలు జరిగితే.. అనకాపల్లి నుంచి శకటం వెళ్లేలోపు పరిస్థితి చేయి దాటిపోతున్నది. కశింకోట మండలం తాళ్లపాలెంలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాల్సిన అవసరం వుంది.

జంబో అగ్నిమాపక కేంద్రం!

- రెండు జిల్లాలు.. తొమ్మిది మండలాలు
- ఉన్నది ఒక్కటే శకటం
- ప్రతిపాదనలకే పరిమితమైన రెండో శకటం మంజూరు
- సిబ్బంది కొరత, రక్షణ పరికరాల లేమి



నర్సీపట్నం అగ్నిమాపక కేంద్రం

నర్సీపట్నం, ఏప్రిల్ 9:
స్థానిక అగ్నిమాపక కేంద్రం అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లో తొమ్మిది మండలాలకు సేవలు అందిస్తున్నది. కానీ ఇక్కడ ఒకే ఒక్క శకటం ఉంది. డబుల్ యూనిట్ (రెండు వాహనాలు)గా అప్‌గ్రేడ్ చేయాలన్న ప్రతిపాదనలు కాగితాలకు పరిమితమయ్యాయి. నర్సీపట్నంలో అగ్నిమాపక కేంద్రం పరిధిలో అనకాపల్లి జిల్లాలో నర్సీపట్నం, మాకవరపాలెం, గొలుగొండ, నాతవరం, కోటవురట్ల, రోలుగుంట; అల్లూరి సీతారామరాజు జిల్లాలో కొయ్యూరు, జీకేవీధి, చింతపల్లి, మండలాలు వున్నాయి. జిల్లాల పునర్విభజన జరిగి పాడేరు కేంద్రంగా కొత్త జిల్లా ఏర్పడినప్పటికీ ఏజెన్సీలో కొత్తగా ఒక్కచోట కూడా అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేయలేదు. రాత్రి సమయంలో అగ్ని ప్రమాదాలు జరిగితే ఆస్తి నష్టాన్ని నివారించి, ప్రాణ నష్టం జరగకుండా చూడడానికి అవసరమైన సామగ్రి ఇక్కడ లేదు. ముఖ్యంగా డ్రాటన్ లైట్లు, హైడ్రాలిక్ కట్టర్స్, గ్యాస్ కట్టర్స్ హైడ్రాలిక్ జాకీ, సిబ్బందికి ఫైర్ షూస్, హీట్ ప్రూఫ్ జాకెట్లు, కళ్లకు వేడి తగలకుండా గాగుల్స్, మాస్కులు, డోర్ బ్రేకర్స్ వంటివి లేవు. అగ్నిమాపక కేంద్రం ఆవరణలో ఉన్న బోరు వున్నప్పటికీ వేసవిలో అడుగంటుతుంది. దీంతో ఉత్తర వాహిని (వరహా నది)కి వెళ్లి నీటిని నింపుకోవాల్సి రావల్సి వస్తుంది. అగ్నిమాపక కేంద్రంలో ఒక ఫైర్ ఆఫీసరు, ముగ్గురు లీడింగ్ ఫైర్‌మెన్, తొమ్మిది మంది ఫైర్‌మెన్, ముగ్గురు డ్రైవర్ ఆపరేటర్లు ఉండాలి. కానీ ప్రస్తుతం ఆరు ఫైర్‌మెన్, రెండు డ్రైవర్ ఆపరేటర్ల పోస్టులు ఖాళీగా వున్నాయి.

రావికమతంలో నీటి కోసం పాట్లు



ఇంజన్ సాయంతో గెడ్డలో నుంచి శకటంలోకి నీటిని పంపింగ్ చేస్తున్న సిబ్బంది (ఫైల్ ఫొటో)

రావికమతం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి):
మండల కేంద్రానికి సమీపంలోని గర్నికంలో సుమారు రెండు దశాబ్దాల క్రితం ప్రైవేటు ఏజెన్సీ ద్వారా అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. రావికమతం, బుచ్చెయ్యపేట, రోలుగుంట మండలాల్లో దాదాపు 40 పంచాయతీలు ఈ కేంద్రం పరిధిలో వున్నాయి. అగ్నిమాపక కేంద్రానికి ఇంతవరకు నీటి సౌకర్యం (బోరు) కల్పించలేదు. ఎక్కడైనా అగ్నిప్రమాదం జరిగితే.. దారిలో వున్న చెరువులు/ గెడ్డలు/ వ్యవసాయ బావుల్లో నుంచి నీటిని తోడుకొని వెళతారు. దీనివల్ల ప్రమాదం జరిగిన ప్రదేశానికి శకటం సకాలంలో వెళ్లలేకపోవడంతో ఆస్తినష్టం పెరిగిపోతున్నది. కాగా ప్రైవేటు ఏజెన్సీ నిర్వహణలో వున్న ఈ కేంద్రంలో పనిచేస్తున్న సిబ్బందికి ఎనిమిది నెలల నుంచి వేతనాలు అందడంలేదు.

అధిక పరిధితో సేవల్లో జాప్యం



ఎలమంచిలి అగ్నిమాపక కేంద్రం

ఎలమంచిలి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి):
స్థానిక అగ్నిమాపక కేంద్రం పరిధిలో ఎలమంచిలి పట్టణం, మండలంతోపాటు రాంబిల్లి, అచ్యుతాపురం మండలాలు వున్నాయి. అచ్యుతాపురం, రాంబిల్లి మండలాలు పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుండడంతో పాటు ఈ రెండు మండలాల్లోని పలు గ్రామాలు సుదూరంలో వున్నాయి. దీంతో ఆయా గ్రామాల్లో అగ్ని ప్రమాదాలు సంభవిస్తే అగ్నిమాపక సేవలు అందించడంలో జాప్యం జరుగుతున్నది. ఈ కారణాల వల్ల అచ్యుతాపురంలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా వుంది.

వేసవిలో తాగునీటి ఎద్దడి ఉండదు

ముందస్తుగానే చర్యలు చేపట్టాం

- తాగునీటి పథకాలు, బోర్లుకు మరమ్మతులు
- ఆశాజనకంగా భూగర్భ జలాలు
- 'ఆంధ్రజ్యోతి'తో ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ రామస్వామి




అనకాపల్లి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి):
వేసవిలో జిల్లాలో ఎక్కడా తాగునీటి ఎద్దడి లేకుండా ముందస్తు చర్యలు చేపట్టామని జిల్లా నీటి సరఫరా విభాగం ఈఈ రామస్వామి తెలిపారు. వేసవి నేపథ్యంలో తాగునీటి ఎద్దడి నివారణ కోసం చేపడుతున్న చర్యలను ఆయన బుధవారం 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధికి వివరించారు. గత ఏడాదితో పోల్చి చూస్తే భూగర్భ జలాలు ఆశాజనంగా ఉన్నా యని చెప్పారు. సమ్మర్ క్రాష్ ప్రోగ్రామ్ ద్వారా గ్రామాల్లోని బో ర్లు, తాగునీటి పథకాల స్థితిగతులను గత నెలలోనే పరిశీలించినట్టు చెప్పారు. జిల్లాలో 28 మెగా రక్షిత మంచినీటి పథకాలు, 1,083 చిన్న, మధ్యతరహా రక్షిత పథకాలు ఉండగా అన్నీ పనిచేస్తున్నా యని వెల్లడించారు. పనిచేయని బోర్లుకు మమ్మతులు జరుగుతున్నాయని చెప్పారు.

జల్ జీవన్ మిషన్ కింద గత ఏడాది 1,869 పనులను రూ.690 కోట్ల అంచనా వ్యయంతో ప్రారంభించగా, ఇంతవరకు రూ.272 కోట్లు ఖర్చు చేసి 1,035 పనులు పూర్తి చేసినట్టు ఈఈ రామస్వామి తెలిపారు. జిల్లాలో 4,17,489 గృహాలకు కొళాయి కనెక్షన్‌లు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటి వరకు 2,65,320 గృహాలకు కనెక్షన్‌లు ఇచ్చామన్నారు.

నర్సీపట్నంలో యువకుడి దారుణ హత్య

అయ్యన్నకాలనీలో నూకాలమ్మ పండగలో డ్యాన్స్ స్టేజ్ వద్ద గొడవ

- మద్యం మత్తులో ఇరువర్గాల మధ్య ఘర్షణ
- చెదరగొట్టి ఇళ్లకు పంపించేసిన పోలీసులు
- కొద్దిసేపటి తరువాత ఒక యువకుడి ఇంటికి మరో యువకుడు కత్తితో వెళ్లి దాడి
- తీవ్ర గాయాలతో ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి
- పోలీసు స్టేషన్‌లో లొంగిపోయిన నిందితుడు



హత్యకు గురైన రుత్తల దుర్గాప్రసాద్ (ఫైల్ ఫొటో)



మేడపై రక్తపు మరకల నమూనాలు, వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీమ్

నర్సీపట్నం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి):
నర్సీపట్నం అయ్యన్న కాలనీలో నూకాలమ్మ పండగ సందర్భంగా ఏర్పాటు చేసిన స్టేజ్ ప్రోగ్రామ్ దగ్గర జరిగిన గొడవ ఒక యువకుడి దారుణ హత్యకు దారి తీసింది. పట్టణ పోలీసులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి.

నర్సీపట్నం మండలం నీలంపేటకు చెందిన రుత్తల దుర్గాప్రసాద్ (24) మంగళవారం రాత్రి గ్రామానికి సమీపంలో వున్న నర్సీపట్నం మునిసిపాలిటీ పరిధిలోని అయ్యన్న కాలనీ (ప్రభుత్వ డిగ్రీ కళాశాల వెనుక)లో జరుగుతున్న నూకాలమ్మ పండగకు వచ్చాడు. డ్యాన్స్ బేబీ డాన్స్ ప్రోగ్రామ్ జరుగుతున్న స్టేజీ ముందు తన స్నేహితుడైన మాకవరపాలెం మండలం పెద్దిపాలెం గ్రామానికి చెందిన పైల సాయితో కలిసి డాన్స్ చేస్తున్నాడు. ఈ క్రమంలో అయ్యన్నకాలనీకి చెందిన చిత్రాడ మహేశ్, అతని స్నేహితులు స్టేజీ దగ్గరకు వచ్చి దుర్గాప్రసాద్, సాయిలతో గొడవ పడ్డారు. మద్యం సేవించి వుండడంతో కొట్లాడుకున్నారు. బందోబస్తులో ఉన్న పట్టణ పోలీసులు వారిని చెదరగొట్టి అక్కడి నుంచి పంపించేశారు. సాయితో కలిసి దుర్గాప్రసాద్ రాత్రి నిద్రించడానికి అయ్యన్న కాలనీలో నివాసం ఉంటున్న తన సోదరుడు (పిన్ని కొడుకు) రుత్తల బోడకొండ ఇంటికి వెళ్లాడు. కొద్దిసేపటి తరువాత దుర్గాప్రసాద్‌కి మహేశ్ ఫోన్ చేసి, సాయితో గొడవపడుతుంటే నువ్వెందుకు అడ్డుకున్నావని ప్రశ్నించాడు. దీంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. మహేశ్ అంతటితో ఆగకుండా అర్ధరాత్రి 1.30 గంటల ప్రాంతంలో దుర్గాప్రసాద్ ఉన్న ఇంటికి వెళ్లి అతనితో గొడవ పడ్డాడు. ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో మహేశ్ వెంట తెచ్చుకున్న కత్తితో దుర్గాప్రసాద్ ఛాతీపై బలంగా పొడిచాడు. ప్రాణభయంతో దుర్గాప్రసాద్ మేడ మీదకు వెళ్లి స్పృహ తప్పి పడిపోయాడు. అంతకుముందు తనను అడ్డుకోబోయిన సాయిని కూడా మహేశ్ కత్తితో పొట్ట మీద, కాలి తొడ భాగంలో పొడిచి అక్కడి నుంచి పరారయ్యాడు. మేడ మీద అపస్మారక స్థితిలో ఉన్న దుర్గా ప్రసాద్‌ను వరుసకు వదిన అయిన మౌనిక (రుత్తల బోడకొండ భార్య) ఆస్పత్రికి తరలించే క్రమంలో దారిలో ప్రాణాలు కోల్పోయాడు. గాయపడిన సాయిని ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. సమాచారం అందుకున్న పోలీసులు బుధవారం ఉదయం అయ్యన్నకాలనీకి వెళ్లారు. పట్టణ సీఐ గోవిందరావు, క్లూస్ టీమ్ మేడ మీద, ఇంటి ఆవరణలో ఆధారాలు సేకరించారు. నిందితుడు మహేశ్ పోలీసు స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయినట్టు తెలిసింది. కాగా దుర్గాప్రసాద్ తండ్రి మూడేళ్ల క్రితం చనిపోయాడు. ఇతనికి తల్లి, చెల్లెలు ఉన్నారు.

ఆరు నెలల్లో మూడు హత్యలు

అన్నీ మద్యం మత్తులోనే...

- విచ్చల విడిగా మద్యం బెల్టు షాపులు, ఓపెన్ బార్లు
- నర్సీపట్నంలో అదుపు తప్పుతున్న శాంతి భద్రతలు
- చోద్యం చూస్తున్న పోలీసు, ఎక్సైజ్ అధికారులు

- 8లో

నాగయ్యపేటలో గిరినాగు హల్‌చల్



గిరి నాగును పట్టుకుంటున్న స్నేక్ క్యాచర్ కృష్ణ

దేవరాపల్లి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) :
మండలంలోని నాగయ్యపేట, వేపాడ మండలం కొప్పలవానిపాలెం సరిహద్దు పొలాల్లో గిరినాగు హల్‌చల్ చేసింది. నాగయ్యపేటకు చెందిన కొమినేని కృష్ణ, సన్యాసి నాయుడు బుధవారం సాయంత్రం పొలానికి వెళుతుండగా దారిలో సుమారు 12 అడుగుల గిరి (శ్వేత) నాగు కంట పడింది. దీంతో సమీపంలోని కొప్పలవానిపాలేనికి చెందిన స్నేక్ క్యాచర్ కృష్ణకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. కొద్ది సేపట్లో కృష్ణ అక్కడకు వచ్చి గిరి నాగును చాకచక్యంగా పట్టుకున్నాడు. అనంతరం అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చి, వారి సమక్షంలో అడవుల్లో విడిచిపెడతానని కృష్ణ చెప్పాడు.

టీడీఆర్ బాండ్లపై తప్పుడు ప్రచారం

- ఇటువంటి మాటలు ఎవరూ నమ్మవద్దు
- భూ విలువ మాదిరిగానే బాండ్ల విలువ కూడా పెరుగుతుంది
- రోడ్డు విస్తరణ నిర్వాసితుల సమావేశంలో ఆర్డీవో ఆయిషా



నిర్వాసితుల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో ఆయిషా

మునగపాక, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : భూముల కోసం బలవంతంగా ఒప్పించడం కాదని, అవగాహన పెంచడానికే గ్రామాల వారీగా నిర్వాసితులతో సమావేశాలు నిర్వహిస్తున్నామని అనకాపల్లి ఆర్డీవో ఆయిషా తెలిపారు. మునగపాక గ్రామ పంచాయతీ ఆవరణలో బుధవారం రోడ్డు విస్తరణ నిర్వాసితులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టీడీఆర్ బాండ్లపై తప్పుడు ప్రచారం జోరుగా జరుగుతోందన్నారు. నిర్వాసితులు ఆందోళనకు గురికావద్దన్నారు. రోడ్డు విస్తరణ విధిగా జరగాల్సిన పరిస్థితులు చోటుచేసుకున్న నేపథ్యంలో ప్రక్రియ వేగవంతంగా జరగడానికే టీడీఆర్ బాండ్ల పంపిణీకి ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. భూ విలువ మాదిరిగానే వాటి విలువ కూడా పెరుగుతుందని చెప్పారు. కొంతమంది తప్పుదోవ పట్టించే విధంగా బాండ్లపై ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ఇది సరైన పద్ధతి కాదన్నారు. ఆర్అండ్‌బీ స్థలంలో ఉన్న కట్టడాలకు కూడా పరిహారం ఇవ్వడం జరుగుతుందని వివరించారు. రోడ్డు విస్తరణకు భూములు, భవనాలు ఇచ్చేందుకు తాము ఎప్పుడూ సిద్ధమేనని నిర్వాసితులు తెలిపారు. నగదు చెల్లింపులు చేస్తామని అధికారులు చెప్పడం వల్లనే ఇందుకు కోసం ముందుకొచ్చామన్నారు. బాండ్లకు మాత్రం ఇచ్చేదిలేదని పునరద్ఘాటించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ ఆది ఉమా మహేశ్వరరావు, వీఎంఆర్డీఏ ప్రతినిధులు, నిర్వాసితులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి స్వల్ప గాయాలు



రోడ్డు ప్రమాదంలో నుజ్జయిన ఆటో

మునగపాక, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : మండలం లోని నాగవరం జంక్షన్ వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు స్వల్పంగా గాయపడ్డారని ఎస్ఐ పి.ప్రసాదరావు తెలిపారు. పరవాడ నుంచి అచ్యుతాపురం వైపు వెళ్తున్న ఆటోను అదే మార్గంలో వెనుక నుంచి వచ్చిన బస్సు నాగవరం జంక్షన్ వద్ద ఢీ కొట్టిందన్నారు. ఈ ఘటనలో ఒంపోలు గ్రామానికి చెం దిన ఆటో డ్రైవర్ శివ కృష్ణ, ఆటోలో ప్రయాణిస్తున్న చోడపల్లికి చెందిన బొడ్డు దుర్గలక్ష్మి, నాగవరానికి చెందిన అప్పికొండ సూర్యకళకు స్వల్ప గాయాలయ్యాయని వివరించారు. ఈ ఘటనపై అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు. ఇదిలావుంటే ఈ ప్రమాదం ఆటో చాలా వరకు దెబ్బతింది.

సమస్యలు తెలుసుకునేందుకే 'ప్రజావాణి'

- గత పాలకులు నియంతలా వ్యవహరించారు
- ప్రస్తుత ప్రభుత్వానికి అభివృద్ధి- సంక్షేమం రెండు కళ్లు
- ఎమ్మెల్యే సుందరపు

మునగపాక, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యలు ప్రత్యక్షంగా తెలుసుకునేందుకే ప్రభుత్వం ప్రజావాణి కార్యక్రమానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్టు ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ తెలిపారు. ఇక్కడి జనసేన పార్టీ కార్యాలయంలో బుధవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందరంగా ఆయన మాట్లాడుతూ గత పాలకులు నియంతలా వ్యవహరించడమే కాకుండా ప్రజలను అనేక ఇబ్బందులకు గురిచేశారన్నారు. సమస్యలు వినడానికి కూడా ఇష్టపడేవారు కారన్నారు. ప్రశ్నించే వారిపై కక్షసాధింపులకు పాల్పడే వారని ఆరోపించారు. ప్రస్తుత ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి పాలన సాగిస్తున్నట్టు చెప్పారు. సాధ్యమైన మేరకు సకాలంలో సమస్యలకు పరిష్కారం చూపాల్సిందిగా ఆయా శాఖల అధికారులకు ఆయన సూచించారు. ఆవకాలువలో రియల్ ఎస్టేట్ వ్యాపారి నిర్మిస్తున్న బ్రిడ్జి కారణంగా ప్రమాదం పొంచి ఉందని స్థానికలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వచ్చారు. అనంతరం పలువురి నుంచి ఎమ్మెల్యే అర్జీలను స్వీకరించారు. సుమారు 125 అర్జీలు అందాయి. ఎంపీడీవో ఎం.ఉషారాణి, తహసీల్దార్ ఆది ఉమామహేశ్వరరావు, పలు ప్రభుత్వ శాఖల అధికారులతో పాటు కూటమి నాయకులు దాడి ముసిలినాయుడు, దొడ్డి శ్రీనివాసరావు, టెక్కలి పరశురాం, ఎ.వి.సత్యనారాయణ, ఆడారి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్

గణితం టెస్టులో జంపపాలెం విద్యార్థుల ప్రతిభ



బహుమతులు పొందిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఎలమంచిలి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జంపపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి విద్యార్థులకు బుధవారం వింగ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గణితం ప్రతిభా పరీక్ష నిర్వహించారు. ఇందులో చక్కగా రాణించిన విద్యార్థులకు ఫౌండేషన్ ప్రతినిధుల ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల చేతులు మీదుగా బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ హెచ్ఎం కె.కృష్ణారావు, ఉపాధ్యాయుడు బొడ్డేటి సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఇటువంటి పోటీలు దోహదపడతాయన్నారు. ఫౌండేషన్ కార్యదర్శి జయప్రకాశ్ మాట్లాడుతూ విద్యార్థులను చదువులో మరింత ప్రోత్సహించేందు తరచూ ఇటువంటి పోటీలు ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగరాజు, చిట్టిరాజు, శివ, సుధాకర్, సుబ్బారావు, నూకరాజు తదితరుతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం

కొత్తపేటలో పూర్వం నుంచి వస్తున్న ఆచారం ప్రకారం నిర్వహణ



రథోత్సవంలో పాల్గొన్న న్యాయమూర్తులు, కుటుంబ సభ్యులు, భక్తులు



విశేష అలంకరణలో సీతారాములు

ఎలమంచిలి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని కొత్తపేటలో గల సీతారాముల ఆలయం ఆవరణలో మంగళవారం రాత్రి స్వామివారి కల్యాణం వైభవంగా జరిగింది. ఎదురుసన్నాహం, రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పూర్వం నుంచి వస్తున్న ఆచారం ప్రకారం శ్రీరామ నవమి రోజున సీతారాముల కల్యాణం కన్నులపండువగా నిర్వహిస్తుంటారు. అనంతరం వచ్చే ఏదాదశి పర్వదినాన కూడా ఈ వేడుకను జడ్జిల సమక్షంలో జరిపించడం ఆనవాయితీ. ఈ ప్రకారం ఇక్కడ కల్యాణం జరపడంతో సందడి వాతావరణం నెలకొంది. దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ సాంబశివరావు పర్యవేక్షణలో నిర్వహించిన కల్యాణోత్సవంలో ఎలమంచిలి సీనియర్ సివిల్ జడ్జి పి.విజయ దంపతులు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పి.స్వాతి భవానీ దంపతులు, అదనపు జూనియర్ సివిల్ జడ్జి టి.వీరరాఘవేంద్రరావు కుటుంబ సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

క్రీడా మైదానంలో మద్యం సేవిస్తే చర్యలు

- ఎక్సైజ్ సీఐ తేజో వెంకటకుమార్



మైదానంలో కోచ్‌తో మాట్లాడుతున్న ఎక్సైజ్ శాఖ సీఐ తేజో వెంకటకుమార్

ఎలమంచిలి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : నిత్యం వందలాది మంది క్రీడాకారులు సాధన చేసే క్రీడా మైదానంలో మద్యం సేవిస్తే చర్యలు తప్పవని ఎలమంచిలి ఎక్సైజ్ సీఐ తేజో వెంకటకుమార్ హెచ్చరించారు. 'ఓపెన్ బార్‌గా ఎలమంచిలి క్రీడామైదానం' శీర్షికతో బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి ఆయన వెనువెంటనే స్పందించారు. ఈ మేరకు క్రీడా

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మైదానాన్ని సందర్శించి కోచ్ రమేష్‌తో పాటు పలువురు క్రీడాకారులతో మాట్లాడారు. మైదానంలో మద్యం సేవించే వారిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. అటువంటివారి ఆట కట్టించేందుకు తమకు సహకారం అందించాల్సిందిగా క్రీడాకారులను కోరారు. ఈ కార్యక్రమంలో రిటైర్డు డీఎస్‌డీవో సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాలలో భవన నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపనలో పాల్గొన్న నాయకులు

అచ్యుతాపురం రూరల్, ఏప్రిల్ 9, (ఆంధ్రజ్యోతి) : తిమ్మరాజుపేటలో ప్రాథమిక పాఠశాల భవన నిర్మాణానికి బుధవారం శంకుస్థాప నిర్వహించారు. ఇక్కడున్న పాఠశాల భవనం శిథిలావస్థలో ఉండడంతో ఇటీవల గ్రామ పెద్దలు ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్‌ను కలిసి సమస్యను వివరించారు. దీనిపై స్పందించిన ఆయన అధికారులతో మాట్లాడడంతో రూ.13 లక్షలు మంజూరయ్యారు. ఈ మేరకు కూటమి నాయకులు, ఉపాధ్యాయులు కలిసి ఈ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ ఆలేటి వరలక్ష్మి, కూటమి నాయకులు శివబాపునాయుడు, మళ్ల చిన్నబాబు, కర్రి భద్రరాజులు, రేవిడి కృష్ణ, కర్రి వెంకునాయుడు, వెలగ అచ్చింనాయుడు, శరగడం నారాయణ మూర్తి, వీరభద్రరావు, ఉపాధ్యాయుడు వెంకట అప్పారావు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించండి

- వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు ఉమాప్రసాద్



వ్యవసాయ శాఖ సిబ్బందితో మాట్లాడుతున్న ఏడీ ఉమాప్రసాద్

పాయకరావుపేట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయం వల్ల కలిగే ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు కె.ఉమాప్రసాద్ సూచించారు. స్థానిక రైతు సేవా కేంద్రంలో పాయకరావుపేట, నక్కపల్లి వ్యవసాయ శాఖ సిబ్బందితో బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శతశాతం ప్రకృతి వ్యవసాయం చేపట్టేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతీ గ్రామంలో 35 మంది రైతులు పీఎండీఎస్ కిట్లు వేయాలని సూచించారు. అలాగే ఖరీఫ్ కార్యాచరణలో భాగంగా రైతులు వరి వేయకముందు నవధాన్యాలు సాగు చేసేలా అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో ఏవోలు వి.ఆది నారాయణ, డి.భవానీ, జడ్ఎన్ఎఫ్, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

పందూరులో 13న హోం మంత్రి పర్యటన



మంత్రి పర్యటన ఏర్పాట్లు పరిశీలిస్తున్న పార్టీ శ్రేణులు

కోటవురట్ల, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత ఈ నెల 13వ తేదిన పందూరులో పర్యటించనున్నట్టు టీడీపీ మండల అధ్యక్షుడు జానకి శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు మంత్రి పర్యటనా ఏర్పాట్లను పార్టీ శ్రేణులతో కలిసి బుధవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆరేళ్లుగా ఆగిపోయిన పందూరు వంతెన పనులకు రాష్ట్ర ప్రభుత్వం రూ5.75 కోట్లు కేటాయించిందని చెప్పారు. ఈ పనులు పూర్తికావడంతో వంతెనను మంత్రి ప్రారంభిస్తారని చెప్పారు. కార్యక్రమంలోప్రాజెక్టు ఏఈ సత్యనారాయణ, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు, సీనియర్ నాయకులు వేచలపు జనార్దన్, సుంకర్ బాబ్జి, ఏలేశ్వరపు సత్యనారాయణ పాల్గొన్నారు.

స్వామిత్వ సర్వేను త్వరితగతిన పూర్తిచేయాలి



గుంటపల్లి గ్రామంలో స్వామిత్వ సర్వేను పరిశీలిస్తున్న ఈవోపీఆర్డీ

పాయకరావుపేట రూరల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో స్వామిత్వ సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని ఈవోపీఆర్డీ సిహెచ్.చంద్రశేఖర రావు సూచించారు. మండలంలోని గుంటపల్లి గ్రామంలో జరుగుతున్న సర్వేను బుధవారం పరిశీలించారు. అనంతరం సీతారాంపురం, అరట్లకోట గ్రామాలను సందర్శించి పంచాయతీ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శతశాతం ఇంటి పన్నులను వసూలు చేయాలని కార్యదర్శులను ఆదేశించారు. అలాగే ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులను చేపట్టాలన్నారు. ఇంటింటి నుంచి తడి, పొడి చెత్తను సేకరించి సంపద తయారీ కేంద్రానికి తరలించాలని ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు హుస్సేన్, రమేశ్, మల్లికార్జునాచారి పాల్గొన్నారు.

ఉపమాకలో ఘనంగా శివపార్వతుల కల్యాణోత్సవం



భక్తులకు దర్శనమిస్తున్న శివపార్వతులు... కల్యాణోత్సవాన్ని తిలకిస్తున్న భక్తజనం

నక్కపల్లి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉపమాక ప్రాచీన శివాలయంలో (భువనేశ్వరి సమేత లక్ష్మణేశ్వరస్వామి ఆలయం) మంగళవారం రాత్రి 11 గంటల నుంచి ఒంటి గంట వరకూ శివపార్వతుల వార్షిక కల్యాణోత్సవం ఎంతో వైభవంగా జరిగింది. ఆలయ ప్రాంగణంలో స్వామివారి కల్యాణం కోసం ప్రత్యేక వేదిక ఏర్పాటు చేశారు. ఉపమాక దేవస్థానం మాజీ చైర్మన్ కొప్పిశెట్టి బుజ్జి ఆధ్వర్యంలో కల్యాణోత్సవానికి విస్తృత ఏర్పాట్లు చేపట్టారు. టీడీపీ మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేశ్, హేమలత దంపతులు పట్టు వస్త్రాలు, పూజా సామగ్రి అందజేశారు. ఆలయ సంప్రదాయల మేరకు అర్చకులు వెలవపల్లి మహేశ్, సంతోశ్, వేదపండితులు భగవాన్ శర్మ, పండుశర్మ, శ్రీపాద ప్రణవ్‌రామ్, భాస్కరప్రసాద్ శివయ్య కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్వామివారికి సప్త హారతులు ఇచ్చినప్పుడు పంచాక్షరీ మంత్రంతో ఆలయం మార్మోగిపోయింది. బుధవారం ఉదయం నక్కపల్లికి చెందిన సింగంశెట్టి బాబాజీ దంపతుల ఆధ్వర్యంలో ఉపమాక శివాలయంలో కుంకుమ పూజ నిర్వహించారు. దాతలు, ఉత్సవ నిర్వాహకులు, వేద పండితులు, సేవకులను కొప్పిశెట్టి బుజ్జి సత్కరించారు. అనంతరం ప్రసాదాలు, రుద్రాక్షలను భక్తులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నక్కపల్లి, ఉపమాక గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

కొబ్బరి దిగుబడిపై ప్రత్యేక దృష్టిసారించండి

డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ శచీదేవి



వమ్మవరంలో కొబ్బరి చెట్లను పరిశీలిస్తున్న పీడీ శచీదేవి

ఎస్.రాయవరం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): కొబ్బరి పంట దిగుబడిపై ప్రత్యేక దృష్టి సారించాలని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ శచీదేవి సూచించారు. మండలంలోని వమ్మవరం గ్రామంలో బుధవారం పీడీ పర్యటించారు. ఈ సందర్భంగా కొబ్బరి పంట దిగుబడికి సంబంధించి గ్రామంలోని రైతు ఉత్పత్తిదారు సంఘాలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పురుషులతో సమానంగా మహిళలు కూడా గ్రూపులుగా ఏర్పడి ప్రకృతి వ్యవసాయం చేసేలా ప్రోత్సహిస్తున్నట్టు చెప్పారు. కొబ్బరి పంటలకు తెల్లదోమ తెగులు సోకడంతో 70 శాతం దిగుబడి తగ్గుముఖం పట్టిందని, కోతుల బెడద కూడా అధికంగా ఉండడంతో తీవ్రంగా నష్టపోతున్నామని పలువురు కొబ్బరి రైతులు పీడీకి తెలిపారు. తెల్లదోమ తెగులు లేకుండా చర్యలు చేపట్టడంతో పాటు కోతుల బెడద లేకుండా చూడాలని రైతులు వారు కోరారు. దీనికి పీడీ స్పందిస్తూ రైతులు తెలిపిన సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని చెప్పారు. అనంతరం గ్రామంలో చేపట్టిన జీవనోపాధి ప్రణాళిక నమోదు కార్యక్రమాన్ని పీడీ పరిశీలించారు. అలాగే ఎన్యూమరేటర్ల సర్వేను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఏరియా కోఆర్డినేటర్ సత్యవేణి, ఏపీఎం శివప్రసాద్, సర్పంచ్ పాలపర్తి పాపారావు, ఎంపీటీసీ సభ్యుడు బాలం సూరిబాబు, టీడీపీ మండల అధ్యక్షుడు అమలకంటి అబద్దం, ఎంపీటీసీ మాజీ సభ్యుడు పల్లెల జగ్గారావు పాల్గొన్నారు.

ఈవ్‌టీజింగ్‌కి పాల్పడితే కఠిన చర్యలు

పాయకరావుపేట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పాఠశాలలు, బస్టాండ్ తదితర చోట్ల నిఘా పెట్టామని, ఎవరైనా అమ్మాయి లపట్ల అసభ్యంగా ప్రవర్తించి ఈవ్‌టీజింగ్‌కి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ జి.అప్పన్న హెచ్చరించారు. పట్టణంలోని శ్రీప్రకాష్ విద్యా సంస్థలు, వివిధ పాఠశాలలు, ఆర్టీసీ బస్టాండ్ తదితర ప్రాంతాల్లో పలువురు మహిళా పోలీసులు బుధవారం విద్యార్థినులను కలసి స్వీయ రక్షణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మహిళలను ఏడిపించే ఏడిపిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

యనమల 42 వసంతాల రాజకీయ ప్రస్థానం పుస్తకావిష్కరణకు తరలిరండి

పాయకరావుపేట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు 42 వసంతాల రాజకీయ ప్రస్థానం పుస్తకావిష్కరణ కార్యక్రమానికి కూటమి నాయకులు, అభిమానులు తరలిరావాలని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్, జనసేన నేత తోట నగేశ్ విజ్ఞప్తి చేశారు. గురువారం తునిలోని సాయివేదిక వద్ద జరిగే ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

విద్యుదాఘాతంతో తోడపెద్దు మృతి



నక్కపల్లి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నెల్లిపూడి గ్రామంలో బుధవారం విషాదం అలముకుంది. గ్రామస్థులు కొన్నేళ్లుగా భక్తిశ్రద్ధలతో పూజించే తోడపెద్దు విద్యుదాఘాతంతో మృతి చెందింది. తోడపెద్దును ట్రాక్టర్‌పై ఊరేగించి సంప్రదాయం మేరకు అంత్యక్రియలు జరిపించారు. తోడపెద్దును సింహాద్రి అప్పన్నగా పూజిస్తుంటారు. ఈ సంఘటనతో గ్రామస్థులు కలత చెందారు.

మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా కంకిపాటి



పాయకరావుపేట రూరల్, ఏప్రిల్ 9 (ఆంధ్యజ్యోతి): మాసాహెబ్‌పేట గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నేత, క్లస్టర్ ఇన్‌చార్జి కంకిపాటి వెంకటేశ్వరరావు పాయకరావుపేట మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా నియమితులయ్యారు. ఆయన గతంలో మాసాహెబ్‌పేట ఎంపీటీసీ సభ్యుడిగా, టీడీపీ మండల అధ్యక్షుడిగా పనిచేశారు. ఈ పదవి కేటాయించిన హోం మంత్రి అనిత, కూటమి నాయకులకు ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

బకాయిలు చెల్లించాలని ఉపాధి కూలీల ఆందోళన

నక్కపల్లిఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఎన్.నర్సాపురం గ్రామంలో వేతన బకాయిలను చెల్లించాలని ఉపాధి కూలీలు బుధవారం ఆందోళనకు దిగారు. రైతు, వ్యవసాయ, కార్మిక, సంఘం, సీఐటీయూ నాయకులు అప్పలరాజు, ఎం.సత్యనారాయణ, ఎం.రాజేశ్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నక్కపల్లి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తొమ్మిది గ్రామాల్లో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఈపీడీసీఎల్ ఏఈ కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. వేంపాడు సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతులు, ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు పనులు ఉండడంతో చేచినదొడ్డిగల్లు, ముకుందరాజుపేట, రమణయ్యపేట, డొంకాడ, జి.జగన్నాథపురం, చీడిక, రేవెళ్ల కొత్తూరు, తిరుపతిపాలెం, దోసలపాడు గ్రామాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా వుండదని చెప్పారు.

ఎస్.రాయవరంలో...

ఎస్.రాయవరం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): కొరుప్రోలు సబ్ స్టేషన్ పరిధిలోని పెద గుమ్ములూరు సెక్షన్, 11 కేవీ గోకులపాడు ఫీడర్లలో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఈపీడీసీఎల్ ఈఈ రాజశేఖర్ ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్లపై ఉన్న చెట్ల కొమ్మల తొలగింపుతో పాటు ఆర్‌డీఎస్ఎస్ పనుల్లో భాగంగా గోకుపాడు, భీమవరం గ్రామాల్లో ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల సరఫరా నిలిపి వేస్తున్నట్టు చెప్పారు.

అలాగే మండల వ్యాప్తంగా త్రీ ఫేస్ సరఫరా సమాయాల్లో గురువారం మార్పు ఉంటుందని ఈఈ తెలిపారు. ఉదయం ఆరు నుంచి 11 గంటల వరకు, మరలా మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు త్రీ ఫేస్ సరఫరా ఉంటుందని చెప్పారు. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించి సహకరించాలి ఆయన కోరారు.

గ్యాస్ సిలిండర్లతో నిరసన

నక్కపల్లి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): పెట్రోల్, పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ రాజయ్యపేట గ్రామంలో సీపీఎం నేతలు బుధవారం నిరసన తెలిపారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు, మండల కార్యదర్శి ఎం.రాజేశ్, నాయకులు ఎం.మహేశ్, నూకరాజు, అప్పారావు, వీరబాబు, జగ్గ, కాశీ తదితరులు ఖాళీ గ్యాస్ సిలిండర్లతో నిరసన తెలిపారు. ఇప్పటికే అనేక వస్తువుల ధరలతో కర్షక, కార్మికులు, పేద, మధ్య తరగతి కుటుంబీకులు ఇబ్బందులు పడుతున్నారని, ఈ సమయంలో గ్యాస్ సిలిండర్‌పై రూ.50 పెంచడం చాలా దారుణమని వాపోయారు.

గీత కార్మికుడికి ఆర్థిక సాయం

నక్కపల్లి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): చిన దొడ్డిగల్లు గ్రామానికి చెందిన గీత కార్మికుడు దొంగల శ్రీను చెట్టుపై నుంచి పడిపోవడంతో కదల్లేని పరిస్థితిలో వున్నాడు. యాదవ సామాజికవర్గం స్నేహితులు, గీత కార్మికుల సంఘం ప్రతినిధులు కలిపి బుధవారం రూ.9,500 నగదు, నెలకు సరిపడా కిరాణా సరకులు అందించారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు పాల్గొన్నారు.



స్పీకర్ అయ్యన్నపాత్రుడికి వినతిపత్రం ఇస్తున్న గ్రంథాలయ ఉద్యోగులు

010 పద్దు కింద జీతాలు ఇవ్వాలని వినతి

నర్సీపట్నం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ సంస్థ ఉద్యోగులు, పెన్షనర్లకు 010 పద్దు కింద జీతాలు, పింఛన్లు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల సంఘం నాయకులు స్పీకర్ అయ్యన్నపాత్రుడును కోరారు. బుధవారం క్యాంప్ కార్యాలయంలో వీరంతా స్పీకర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. స్పీకర్ సానుకూలంగా స్పందించారని, మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.మల్లేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం ట్రెజరర్ కాకి అప్పారావు, రాష్ట్ర నాయకులు పైడిరాజు, కన్నబాబు, జిల్లా నాయకులు నర్సింహం, మురళీకృష్ణ, దమయంతి, త్రిమూర్తులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మూడు వార్డుల్లో అభివృద్ధి పనులకు భూమి పూజ

నర్సీపట్నం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 24, 25, 27 వార్డుల్లో రూ.36.7 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు కౌన్సిలర్ చింతకాయల పద్మావతి, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయ్ బుధవారం భూమి పూజ చేశారు. 28వ వార్డు అయ్యన్నకాలనీలో రూ.15.46 లక్షలతో మూడు పనులు, 25వ వార్డు సరస్వతి ప్రెస్ సందులో రూ.5.76 లక్షలతో ఒకటి, 27వ వార్డు శివపురంలో రూ.15.48 లక్షలతో రెండు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా చింతకాయల విజయ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొమ్మిది నెలల్లోనే వార్డులలో రూ.4 కోట్ల తో 53 అభివృద్ధి పనులు చేపడుతున్నామని చెప్పారు. గత ప్రభుత్వంలో శివపురంలో కల్వర్టు పాడైతే తూతూమంత్రంగా మరమ్మతులు చేసి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు కారణంగా రూ.50 లక్షలతో కల్వర్టు నిర్మాణం చేసుకోగలిగామన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు దనిమిరెడ్డి మధుబాబు, కాశీరత్నం, పైల గోవింద్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చెరకు రైతుల బకాయిలపై ఆందోళన



బకాయిలు చెల్లించాలని ఫ్యాక్టరీ ఎదుట రైతు సంఘాల నేతల నినాదాలు

చోడవరం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): చెరకు రైతుల బకాయిల చెల్లింపులో గోవాడ షుగర్స్ యాజమాన్యం నిర్లక్ష్యవైఖరిని నిరశిస్తూ బుధవారం ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. సీజన్ ముగిసిపోతున్న గత సీజన్ బకాయిలు చెల్లించకుండా ఉండిపోవడం రైతులను వంచించడమేనని ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి వివి.శ్రీనివాసరావు విమర్శించారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు ఎస్‌వి.నాయుడు, శ్రీను, రాజు, నూకరాజు పాల్గొన్నారు.

వేతన బకాయిలు చెల్లించాలని ఉపాధి కూలీల నిరసన

వేతన బకాయిలు చెల్లించాలని డిమాడ్‌చేస్తూ దుడ్డుపాలెం, అంభేరుపురం గ్రామాల్లో ఉపాధి కూలీలు బుధవారం నిరసన తెలిపారు. జిల్లాలో పది వారాలుగా కూలి బకాయిలు సుమారు రూ.54 కోట్లు పెండింగ్‌లో ఉండడం కారణంగా కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు శ్రీనివాసరావు, నాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో ప్రభుత్వం తక్షణమే స్పందించాలని వారు కోరారు.

పాస్టర్ ప్రవీణ్ మృతిపై విచారణ చేయాలి

» చోడవరంలో క్రైస్తవుల ఆందోళన



కొత్తూరు జంక్షన్‌లో ఆందోళన చేస్తున్న క్రైస్తవులు

చోడవరం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): పాస్టర్ ప్రవీణ్ పగడాల మరణంపై సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తూ బుధవారం క్రైస్తవ సంఘాల సభ్యులు ఆందోళన కార్యక్రమం చేపట్టారు. క్రైస్తవులకు రక్షణ కల్పించడంతో పాటు వారిపై పెరుగుతున్న దాడుల నిరోధానికి చర్యలు చేపట్టాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. స్థానిక ఆర్‌సీఎం చర్చి నుంచి క్రైస్తవ సోదరులు కొత్తూరు జంక్షన్ వరకూ శాంతి ర్యాలీ నిర్వహించారు. అనంతరం జంక్షన్‌లో మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. పాస్టర్లు నేవాహు, యేసు రాజు, వై.ఆకులు పాల్గొన్నారు.

సాగునీటి కాలువ పనులు చేపట్టండి

» మండల సర్వసభ్య సమావేశంలో సభ్యుల డిమాండ్



సమావేశంలో అధికారులను నిలదీస్తున్న ప్రజా ప్రతినిధులు

మాకవరపాలెం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలో సాగునీటి కాలువల పనులు చేపట్టాలని ప్రజాప్రతినిధులు డిమాండ్ చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రుత్తల సర్వేశ్వరరావు అధ్యక్షతన బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాచపల్లి ఎంపీటీసీ సభ్యుడు ఆర్‌వై.పాత్రుడు, భీమబోయినపాలెం ఎంపీటీసీ సభ్యుడు సత్యనారాయణ మాట్లాడుతూ ఉపాధి పథకం ద్వారా ఈ పనులను చేపట్టాలని అధికారులను కోరారు. మండల వ్యవసాయ అధికారి చిరంజీవి మాట్లాడుతూ రైతులకు రాయితీపై వ్యవసాయ పరికరాలు అందిస్తున్నామన్నారు. ,అలాగే ఈ ఏడాది 900 టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. ప్రతీ గ్రామంలో ప్రకృతి వ్యవసాయం చేసేందుకు రైతులకు సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. అయితే టీడీపీకి చెందిన వారికే పథకాలు ఇస్తున్నారని బూరుగుపాలెం సర్పంచ్ రమణ ఏవోను ప్రశ్నించారు. దీంతో సభ్యులు, అధికారులకు మధ్య వాగ్వాదం జరిగింది. అనంతరం ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవో కాశీ మాట్లాడుతూ ఉపాధి పథకం ద్వారా వ్యవసాయ భూములు, చేపల చెరువుల్లో పనులు చేయడంతో పాటు ప్రతీ గ్రామంలో చెరువు నిర్మాణాలు చేపడతామన్నారు. ఇంతలో టీడీపీ సభ్యుడు ఆర్‌వై.పాత్రుడు మాట్లాడుతూ గ్రామాల్లో వ్యవసాయ సాగునీటి కాలువలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఈపీడీసీఎల్ ఏఈ బాలకృష్ణ మాట్లాడుతూ సోలార్ ద్వారా ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా విద్యుత్ ఇచ్చేందుకు సర్వే నిర్వహించామన్నారు. బూరుగుపాలెం వీఆర్వో, డీటీని బదిలీ ఎందుకు చేశారని బూరుగుపాలెం సర్పంచ్ రమణ రెవెన్యూ అధికారులను ప్రశ్నించారు. అనంతరం ఇతర శాఖల అధికారులు తమ శాఖల నివేదికను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీపీ సీతామహాలక్ష్మి, వైస్ ఎంపీపీలు రాజారావు, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ సర్కిల్ కార్యాలయ భవనానికి మోక్షమెన్నడో..?

పాడుబడిన భవనాలు.. ఇరుకు గదులు.. ఎదురుగా ఇసుక పోగులు.. మరోపక్క తుప్పుపట్టిన వాహనాలు.. చుట్టూ తుప్పలు.. అరకొర వసతులు.. ఇదీ చోడవరం పోలీస్ సర్కిల్ కార్యాలయం దుస్థితి. అసెంబ్లీ సాక్షిగా అప్పటి హోం మంత్రి హామీ ఇచ్చినా నూతన భవనాల నిర్మాణం నెరవేరని కలగానే మిగిలి పోతుందానన్న ఆందోళన పోలీసులను వెంటాడుతోంది.

పాడుబడిన స్టేషన్ పాత భవనం

- » తుప్పు పట్టిన వాహనాలతో నిండిపోయిన ఆవరణ
- » ఇరుకుగా సిబ్బంది, రికార్డులు భద్రపరిచే గదులు
- » అసెంబ్లీ సాక్షిగా కొత్త భవనం నిర్మాణానికి నాటి హోం మంత్రి హామీ
- » కూటమి ప్రభుత్వ హయాంలోనైనా నెరవేరుతుందని పోలీసుల్లో ఆశలు



శిథిలావస్థలో పాత పోలీస్ సర్కిల్ కార్యాలయం భవనం

చోడవరం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): చోడవరం సర్కిల్ పోలీస్ స్టేషన్ కార్యాలయ భవనం స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలో నిర్మించిన కట్టడం. ప్రస్తుతం ఎస్పీ, డీఎస్పీలుగా పనిచేస్తున్న ఎంతో మంది అధికారులు ఇక్కడే పనిచేసి వెళ్లారు. కాలక్రమంలో ఈ సర్కిల్ పోలీస్ స్టేషన్ భవనం



వాహనాలతో నిండిపోయిన ప్రస్తుత సర్కిల్ స్టేషన్ భవనం ఆవరణ

శిథిలావస్థకు చేరింది. ఈ కార్యాలయంలో ఉన్న సీఐ కార్యాలయం కె.కోటపాడు తరలిపోవడం, స్థానిక పోలీస్ స్టేషన్‌ను అప్‌గ్రేడ్ చేసి సీఐ కార్యాలయంగా మార్చడంతో ప్రస్తుతం ఎస్ఐ ఉండే స్టేషన్‌లోనే సీఐ కార్యాలయాన్ని నిర్వహిస్తున్నారు. ఈ పోలీస్ స్టేషన్‌లోనే ఒక సీఐతో పాటు ఇద్దరు ఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, రైటర్లు, కంప్యూటర్ సిబ్బంది సర్దుకోవాల్సి వస్తోంది.

ఇదే భవనంలో నిందితుల లాకప్, కేసుల్లో పట్టుబడిన సామగ్రి కూడా ఉంచాల్సి రావడంతో చాలా ఇరుకుగా ఉంటున్నది. ఫలితంగా సిబ్బందికి ఇబ్బందికరంగా మారుతోంది. దీనికితోడు స్టేషన్ ఆవరణ అంతా కేసుల్లో పట్టుబడిన వాహనాలతో నిండిపోయి ఉంది. దీంతో ఈ స్టేషన్ బూత్ బంగ్లాగా మారిపోయింది. ఇక పాత సర్కిల్ భవనం శిథిలం కావడంతో అందులో రికార్డులు భద్రపరచడానికి మాత్రమే వినియోగిస్తున్నారు. ఉన్నతాధికారులు వచ్చినపుడు కనీసం సమావేశాలకు కూడా అవకాశం లేని విధంగా ఈ సర్కిల్ కార్యాలయం పరిస్థితి మారింది.

15 ఏళ్లుగా కొత్త భవనానికి విజ్ఞప్తులు

పురాతనమైన ఈ పోలీస్ సర్కిల్ భవనం శిథిలావస్థకు చేరడంతో సిబ్బంది అవసరాలకు సరిపడేలా కొత్త భవనం నిర్మించాలని 15 సంవత్సరాలుగా పోలీస్ అధికారులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తూనే ఉన్నారు. అయినప్పటికీ పరిస్థితిలో ఏమాత్రం మార్పులేదు. కానీ ఇదే సర్కిల్ నుంచి రెండేళ్ల క్రితం వేరుపడి కె.కోటపాడు కేంద్రంగా ఏర్పాటైన మాడుగుల పోలీస్ సర్కిల్ కార్యాలయానికి మాత్రం కొత్త భవనం మంజూరు కావడం, నిర్మాణం పూర్తయి ప్రారంభించడం విశేషం. అయినప్పటికీ చోడవరంలో సర్కిల్ కార్యాలయ భవనం పరిస్థితిలో మార్పు లేకపోవడంతో పోలీసులతో పాటు స్థానికుల ప్రజలను విస్మయానికి గురిచేస్తున్నది.

నెరవేరని నాటి హోం మంత్రి హామీ

చోడవరంలో పోలీస్ సర్కిల్ కార్యాలయానికి నూతన భవనాలను నిర్మిస్తామంటూ వైసీపీ ప్రభుత్వ హయాంలో నాటి హోంమంత్రి మేకతోటి సుచరిత అసెంబ్లీ సాక్షిగా హామీ ఇచ్చారు. ఐదేళ్ల కాలంలో నాటి హోం మంత్రి ఇచ్చిన హామీ అమలుకాలేదు. తాజాగా తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి రావడం, జిల్లాకు చెందిన పాయకరావుపేట ఎమ్మెల్యే వంగలపూడి అనిత హోం మంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టడంతో మరోసారి చోడవరం సర్కిల్ కార్యాలయానికి నూతన భవనంపై ఆశలు మొలకెత్తాయి. జిల్లాకు చెందిన హోం మంత్రి హయాంలోనైనా చోడవరం సర్కిల్ పోలీస్ స్టేషన్ భవనాలకు మోక్షం దక్కుతుందని పోలీసు అధికారులు, స్థానిక ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు. వీరి ఆశలు ఎప్పటికి నెరవేరుతాయో వేచిచూడాల్సిందే!



పోలీసు స్టేషన్ పరిసరాల్లో పేరుకుపోయిన ఇసుక, చెత్త కుప్పలు

ప్రజాదర్బార్ వినతులను పరిష్కరిస్తాం

» ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి



ప్రజాదర్బార్‌లో వృద్ధురాలు సమస్యను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే బండారు

కె.కోటపాడు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రజాదర్బార్‌లో ఇచ్చిన ప్రతీ ఫిర్యాదుకు పరిష్కారం లభిస్తుందని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యే అధ్యక్షతన ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు. ముందుగా ఎమ్మెల్యే బండారు అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతీ అధికారి ప్రజలకు జవాబుదారుగా ఉండి, వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు ప్రజలకు పనులు చేయడంలో ఇబ్బందులు సృష్టించొద్దు స్పష్టం చేశారు. గ్రామాల్లో ఎక్కువగా భూ సమస్యలు ఉంటాయని, వాటిని వీఆర్వో స్థాయిలోనే పరిష్కరించాలని సూచించారు. ప్రతీ చిన్న ఫిర్యాదు జిల్లా స్థాయికి తీసుకువెళ్లి కలెక్టర్ స్పందనలో ఇస్తున్నారని, అది సరికాదని ఆయన స్పష్టం గ్రామాల్లో చిన్న చిన్న సమస్యలు, కుటుంబ తగాదాలు పరిష్కారానికి మండల స్థాయిలో కో-ఆర్డినేషన్ కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఆ కమిటీలో ఎంపీడీవో, తహసీల్దార్, సబ్ ఇన్‌స్పెక్టర్ సభ్యులుగా ఉండి సమస్యలు 90 శాతం పరిష్కరించే దిశగా పనిచేస్తారన్నారు. ప్రజాదర్బార్‌లో ఇచ్చిన ప్రతి ఫిర్యాదుకు కచ్చితమైన సమాధానం ఇస్తారన్నారు. కె.కోటపాడులో జరిగిన ప్రజా దర్బార్‌లో అన్ని గ్రామాల నుంచి సుమారు 160 ఫిర్యాదులు రాగా, ఎక్కువగా రెవెన్యూ సమస్యలపై అందాయని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సాంబశివరావు, తహసీల్దార్ రమేశ్‌బాబు, పార్టీ నాయకులు రొంగలి మహేశ్, జూరెడ్డి రాము, సబ్బవరపు రామునాయుడు, సర్పంచులు బొడ్డు అక్కునాయుడు, డి.ఎరుకునాయుడు, పి.నారాయణమూర్తి పాల్గొన్నారు.

సీసీటీఎన్ఎస్‌లో కేసుల పురోగతి నమోదు

- » డ్రోన్‌ల ద్వారా ట్రాఫిక్ నియంత్రణ చేపట్టండి
- » గంజాయి లభించే ప్రాంతాలు, సేవించే వారి వివరాలు సేకరించండి
- » నెలవారీ నేర సమీక్ష సమావేశంలో ఎస్పీ తుహిన్‌సిన్హా



నెలవారీ నేర సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి రూరల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : కేసుల పురోగతిని ఎప్పటికప్పుడు క్రైమ్ అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ సిస్టమ్ (సీసీటీఎన్ఎస్)లో నమోదు చేయాలని ఎస్పీ తుహిన్ సిన్హా అధికారులను ఆదేశించారు. ఇక్కడి జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం నెలవారీ నేర సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ముందుగా జిల్లాలోని పోలీస్ స్టేషన్ల వారీగా నమోదు చేసిన కేసులకు సంబంధించి పురోగతిని ఆయా అధికారుల ద్వారా తెలుసుకున్నారు. భవిష్యత్తులో అన్ని రివ్యూ మీటింగ్‌లు సీసీటీఎన్ఎస్ ఆధారంగా నిర్వహించనున్నందున ఎస్ఐలు, సీఐలు, డీఎస్పీలు ఈ విధానంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. డ్రోన్‌ల ద్వారా ట్రాఫిక్ నియంత్రణతో పాటు పండుగలు, జాతరల వద్ద నిఘా పెంచాలని సూచించారు. పేకాట, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, చట్టవ్యతిరేక కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. మిస్సింగ్ కేసుల్లో ఎటువంటి ఆలస్యం లేకుండా తక్షణమే కేసులు నమోదు చేసి దర్యాప్తు చేయాలని సూచించారు. గంజాయి లభించే ప్రాంతాలు, సేవించేవారి వివరాలు సేకరించి జిల్లా పోలీస్ కార్యాలయానికి పంపాలన్నారు. అనంతరం విధి నిర్వహణలో ప్రతిభ చూపిన అధికారులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఏఎస్పీలు దేవప్రసాద్, మోహనరావు, డీఎస్పీలు పోతిరెడ్డి శ్రీనివాసరావు, శ్రావణి, వి.విష్ణుస్వరూప్ తదితరులు పాల్గొన్నారు.

చినభీమవరంలో ఆక్రమణలు తొలగించాలి

బుచ్చెయ్యపేట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చినభీమవరం గ్రామంలో ఆక్రమణలు తొలగించాలని గ్రామస్థులు కావలి సతీశ్, రాజారావు, అప్పారావు, వెంకటరావు, శ్రీను, అప్పలనాయుడు, శ్రీధర్, సురేశ్, రమణ డిమాండ్ చేశారు. ఈ సర్వే చేస్తే ఆక్రమణల పర్వం బయట పడుతుందని చెప్పారు. రీ సర్వే కోరుతూ పలుమార్లు అర్జీలు అందించామని, అయినప్పటికీ స్పందన లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా స్పందించపోతే కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తామని వారు హెచ్చరించారు.


కొవడ కాలువలో ఆక్రమణలు



కొండ కాలువలో మట్టిని వేసి కప్పుతున్న దృశ్యం

రోలుగుంట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): కె.నాయుడుపాలెం వెళ్లే దారిలో ఉన్న కొండకాలువ ఆక్రమణకు గురవుతున్నది. స్థానిక కొండ నుంచి వచ్చే నీరు ప్రవహించి చుట్టు పక్కల పొలాలకు నీరు అందుతుంది. ఇటీవల ఆ కొండ కాలువను కొంత మంది అక్రమార్కులు కబ్జా చేసే ప్రయత్నం చేస్తున్నారు. ట్రాక్టర్లతో మట్టి తెచ్చి కాలువను కప్పి వేస్తున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత రెవెన్యూ అధికారులు ఏమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. ఈ కాలువ పూర్తిగా ఆక్రమణకు గురైతే కొండపై నుంచి వచ్చే నీరు రోడ్డుపై పారుతుందని, సమీప పొలాలు ముంపునకు గురవుతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. రెవెన్యూ అధికారులు ఆక్రమణపై దృష్టిసారించాలని కోరుతున్నారు.

విద్యుత్ స్తంభాలు నేలమట్టం.. తప్పిన ప్రమాదం



ఎం.అమండలో నేలమట్టమైన విద్యుత్ స్తంభాలు

దేవరాపల్లి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం.అమండ, వారాడ రోడ్డులో బుధవారం మూడు విద్యుత్ స్తంభాలు నేలమట్టమయ్యాయి. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ విద్యుత్ సరఫరా ఉండడంతో స్థానిక ప్రజలు భయంతో పరుగులు తీశారు. వారాడ-వేచలం-ఎంఅలమండ రోడ్డులో నిత్యం వాహనాలు తిరుగుతుంటాయి. ఈ రోడ్డుకిరువైపులా కొన్ని విద్యుత్ స్తంభాలు శిథిలావస్థలో ఉన్నాయి. ఈ క్రమంలో బుధవారం ఒక్కసారిగా వీచిన ఈదురుగాలులతో మూడు స్తంభాలు విరిగిపోయాయి. ఈ విషయాన్ని రైవాడ జలాశయం ఛైర్మన్ పాత్రునాయుడు తెలిపారు. ఈ విషయమై ఏఈఈ కర్రి శంకరరావును వివరణ కోరగా స్తంభాల విషయం తన దృష్టికి రాలేదని, విరిగిన స్తంభాల స్థానంలో కొత్తవి వేస్తామని చెప్పారు.

శిథిలావస్థలో బస్ షెల్టర్



కూలిపోయే దశకు చేరిన షెల్టర్

బుచ్చెయ్యపేట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): రాజాం తట్టబంద ఆర్‌టీ రోడ్డులో చింతపాక జంక్షన్‌లో బస్‌షెల్టర్ శిథిలావస్థకు చేరడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 2002లో అనకాపల్లి ఎంపీగా ఉన్న గంటా శ్రీనివాసరావు తన నిధులతో ఈ షెల్టర్ నిర్మించారు. చాలా ఏళ్లు కావడంతో షెల్టర్ భవనం గోడలు బీటలువారి శ్లాబ్ పెచ్చులు ఊడుతున్నాయి. ఈ జంక్షన్‌లో బస్సుల కోసం నిరీక్షించేందుకు ప్రయాణికులకు ఇదొక్కటే ఆధారం. పరిసరాల్లో కనీసం చెట్లు కూడా లేవు. గత్యంతరం లేకపోవడంతో శిథిలావస్థలో ఉన్న ఈ షెల్టర్‌లో ఉంటున్నామని, భవనం దుస్థితి చూసి బిక్కుబిక్కుమని చూస్తున్నామని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు, పాలకులు స్పందించి బస్ షెల్టర్ భవనానికి కనీసం మరమ్మతులైనా చేపట్టాలని వారు విజ్ఞప్తి చేశారు.

పాఠశాలకు క్రీడా సామగ్రి పంపిణీ

నర్సీపట్నం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): బీసీ కాలనీలోని ఎంపీపీ స్కూల్ విద్యార్థులకు టీడీపీ ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ క్రీడా సామగ్రి పంపిణీ చేశారు. బుధవారం పాఠశాల ఆవరణలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జి లాలం మురళీ చేతుల మీదుగా ఉపాధ్యాయులకు సామగ్రిని అందించారు.

ఏఐటీటీ-2025 పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

నర్సీపట్నం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఏఐటీటీ-2025 పరీక్షలు ప్రైవేటు అభ్యర్థులుగా హాజరుకావడానికి ఈ నెల 12వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ డి.శ్రీనివాసచారి ఒక ప్రకటనలో తెలిపారు. ఇతర వివరాలకు దగ్గరలోని ఐటీఐలో సంప్రదించాలని ఆయన సూచించారు.

తొమ్మిది మంది జూదరులపై కేసులు

గొలుగొండ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాకలపాడు గ్రామ శివారులో పేకాట ఆడుతున్న తొమ్మిది మందిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ రామారావు బుధవారం తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు పేకాట శిబిరంపై దాడులు చేశామన్నారు. ఈ దాడుల్లో తొమ్మిది మంది వ్యక్తులు పట్టుబడ్డారని, వారి నుంచి నాలుగు వేల రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. జూదరులపై కేసు నమోదు చేసినట్టు ఆయన చెప్పారు.

ప్రజాదర్బార్‌కు బీజేపీ శ్రేణుల తాగునీటి సదుపాయం

కె.కోటపాడు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రజా దర్బర్‌కు విచ్చేసిన ప్రజలకు బీజేపీ నాయకులు, కార్యకర్తలు మంచినీటి సౌకర్యాన్ని కల్పించారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలకు బీజేపీ మండల అధ్యక్షురాలు పైలా అమ్మాజీ నేతృత్వంలో కార్యకర్తలు చల్లటి మంచినీటిని అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఇమంది సన్యాసిరావు, దేముడుబాబు పాల్గొన్నారు.

శ్మశానవాటికకు సీసీ రోడ్డు నిర్మాణం

గొలుగొండ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలవరం గ్రామంలో శ్మశానవాటికకు సిమెంట్ రోడ్డు నిర్మిస్తున్నారు. చీడిగుమ్మల గ్రామ పంచాయతీలో శివారు పోలవరం గ్రామంలో శ్మశానం అభివృద్ధికి స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు సుమారు రూ.25 లక్షలు మంజూరు చేశారు. ఈ నిధులతో సిమెంట్ రోడ్డు, బోరు నిర్మాణ పనులు చేపడుతున్నారు. టీడీపీ నాయకులు కామిరెడ్డి గోవింద, బీమిరెడ్డి సత్యనారాయణ బుధవారం ఈ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కామిరెడ్డి శ్రీరామ్మూర్తి, లెక్కల శివ, తదితరులు పాల్గొన్నారు.

'గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలకు అధిక ప్రాధాన్యం'

రావికమతం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నదని గొంప ఎంపిటీసీ సభ్యుడు గంజి సూర్యనారాయణ చెప్పారు. మండల పరిషత్ నిధులు రూ.2 లక్షలతో గొంప రోడ్డు నిర్మాణ పనులను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయంలో ఏ పంచాయతీలోనూ రోడ్డు నిర్మించిన దాఖలాలు లేవన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రామాలలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నదన్నారు. అనంతరం గుడ్డిప పంచాయతీ శివారు వినాయక ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేశారు. నాయకులు చేపూరి భీమునాయుడు, కె.రాజు, రమణ, టీడీపీ నాయుకులు మజ్జీ కొండయ్య, గల్లా నానిబాబు, నాయకులు కలగ చిరంజీవి పాల్గొన్నారు.

'అణగారిన వర్గాలపై పెరిగిన దాడులు'

కృష్ణాదేవిపేట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): దేశంలో అణగారిన వర్గాలపై దాడులు పెరిగాయని సీపీఐ జిల్లా సహాయకార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు అన్నారు. బుధవారం జరిగిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ దాడులపై పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. గ్యాస్, పెట్రోల్ ధరలు నియంత్రించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రాధాకృష్ణ, ఎం.సత్యనారాయణ, ఎం.భాస్కరావు, దుర్గాభవాని, సత్యనారాయణ, చిరంజీవి, బాబ్జి, రాంబాబు, జమీలు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో ప్రసవం శ్రేయస్కరం

చింతపల్లి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు విధిగా ఆస్పత్రిలోనే ప్రసవం పొందాలని స్త్రీవైద్యనిపుణులు కుసుమరాణి అన్నారు. బుధవారం స్థానిక ఏరియా ఆస్పత్రిలో ప్రధాన మంత్రి సురక్షిత మంత్రిత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా 245మంది గర్భిణులకు వైద్యపరీక్షలు, అల్ట్రాసౌండ్ స్కానింగ్ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు స్కానింగ్ చేయించుకోవాలన్నారు. దీని వల్ల ప్రమాదకరమైన ప్రసవాలను ముందుగా గుర్తించవచ్చునన్నారు. గర్భిణులు ప్రసవ సమయానికి పది రోజులు ముందుగా చింతపల్లి గర్భిణుల వసతి గృహంలో చేరాలన్నారు. ఈకార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ ఇందిరా ప్రియాంక పాల్గొన్నారు.

వైద్యునికి ఘన వీడ్కోలు



గర్భిణులను తనిఖీలు చేస్తున్న వైద్య సిబ్బంది

చింతపల్లి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏరియా ఆస్పత్రిలో రెండేళ్ల విధులు నిర్వహించిన ఆర్థోపిడిక్ వైద్యుడు ఈ. సాయికృష్ణ సేవలు అభినందనీయమని సూపరింటెండెంట్ పి. ఇందిరా ప్రియాంక అన్నారు. తాజా బదిలీల్లో సాయికృష్ణకు నంద్యాల ఏరియా ఆస్పత్రికి బదిలీ అయింది. ఈమేరకు బుధవారం రిలీవ్ అయిన ఆయనకు తోటి వైద్యులు, వైద్య సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. ఈసందర్భంగా సూపరింటెండెంట్ మాట్లాడుతూ ఆర్థోపిడిక్ వైద్యుడు స్థానిక నివాసం ఉంటూ ప్రజలకు సేవలందించారన్నారు. అత్యధిక శస్త్రచికిత్సలు చేశారన్నారు. సాయికృష్ణ బదిలీపై వెళ్తుండడంతో పలువురు రోగులు, దిగువస్థాయి వైద్య సిబ్బంది ఆయనను కలిసి కన్నీటి పర్యంతమయ్యారు. ఈకార్యక్రమంలో చిన్నపిల్లల వైద్యులు జి.ప్రభావతి, వైద్యులు రుక్మిణి, భారతి, లావణ్య, నర్సింగ్ సూపరింటెండెంట్ పద్మావతి, ఫిజియోథెరపిస్టు సరోజిని పాల్గొన్నారు.

కూరగాయల వ్యాపారులకు సంత షెడ్ల కేటాయింపు



గర్భిణులను తనిఖీలు చేస్తున్న వైద్య సిబ్బంది

చింతపల్లి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం వారపు సంతలో షెడ్లను కూరగాయల వ్యాపారులకు పంచాయతీ అధికారులు కేటాయించారు. పోలీసుల సహకారంతో గత వారం నుంచి రహదారికి ఇరువైపులా దుకాణాలను తొలగించి షెడ్ల వద్దకు సంతను మార్పు చేసిన విషయం పాఠకులకు తెలిసిందే. ఈమేరకు బుధవారం సంత షెడ్లు, దుకాణాలు ఏర్పాటు చేసుకునే స్థలాలను కూరగాయల వ్యాపారులకు లాటరీ పద్ధతిలో కేటాయించారు. ఈకార్యక్రమంలో ఇన్‌చార్జి ఈవోఆర్డీ శ్రీధర్, పంచాయతీ గుమస్తా అంబేడ్కర్ పాల్గొన్నారు.


సమస్యలపై వినతి



గిడ్డి ఈశ్వరికి వినతి పత్రమిస్తున్న ధారకొండ, దుప్పులవాడల నాయకులు

సీలేరు, ఏప్రిల్ 9 , (ఆంధ్రజ్యోతి) : జీకేవీధి మండలంలోని ధారకొండ, దుప్పులవాడ పంచాయతీల పరిధిలోని పలు గ్రామాల్లో సమస్యలను పరిష్కరించాలని కోరుతూ, కూటమి నాయకులు బుధవారం పాడేరులో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరికి వినతి పత్రాలను అందజేశారు. ఈ పంచాయతీల్లో నరమామిడిగొంది, నిమ్మచెట్టు, వర్తుండపాడు, ధర్మాపురం చిన్నగంగవరంల్లో తాగునీటి సమస్య, రోడ్లు సమస్యను పరిష్కరించాలని కోరారు. డీ అగ్రహారం వంతెన నిర్మాణం చేపట్టాలన్నారు. ఈ సమస్యలను అధికార్ల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామనిఈశ్వరి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు పోతురాజు గోవిందరావు, సుందరరావు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు



కార్యదర్శులతో సమావేశమైన ఎంపీపీ నీలవేణి

అనంతగిరి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో 24 పంచాయతీల కార్యదర్శులతో బుధవారం ఎంపీపీ శెట్టి నీలవేణి సమావేశమయ్యారు. వేసవి నేపథ్యంలో గిరిగ్రామాల్లో తాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని కార్యదర్శులకు ఆదేశించారు.

కొత్తపల్లి జలపాతం సందర్శన



జలపాతంలో జేడీ డా. ప్రసన్న, డీఎండ్‌చ్‌వో బృందం

జి.మాడుగుల, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొత్తపల్లి జలపాతంలో బుధవారం సాయంత్రం పాడేరు జాయింట్ డైరెక్టర్ డా.ప్రసన్న బృంధం, డీఎండ్‌హెచ్‌వో జమల్ బాషా సందర్శించారు. ప్రకృతి సిద్ధంగా ఏర్పడిన ఈ జలపాతం అద్భుతంగా ఉందని వారు అభివర్ణించారు. జలపాతం సుందరీకరణ పనులను పరిశీలించారు.

అధికారుల నిర్లక్ష్యంతోనే తాగునీటి సమస్య

» అరకు మండల సమావేశంలో

ఎంపీటీసీ సభ్యులు, సర్పంచుల ధ్వజం



ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈని ప్రశ్నిస్తున్న సంకరమెట్ట సర్పంచ్ చినబాబు

అరకులోయ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మండల సర్వసభ్య సమావేశం వాడీవేడీగా సాగింది. జలజీవన్‌మిషన్ వాటర్‌స్కీం, ఇతర పథకాల పనులు అసంపూర్తిగా వదిలేయడంతో గ్రామాల్లో తాగునీటి సమస్య నెలకొంటోందని సుంకరమెట్ట సర్పంచ్ చినబాబు, పెదలబుడు ఎంపీటీసీ సభ్యుడు శత్రుఘ్న, దురియా ఆనందరావు, వైస్ ఎంపీ రామన్న తదితరులు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈని ప్రశ్నించారు. పంచాయతీల్లో అభివృద్ధి పనులను కాంట్రాక్టర్‌తో కాకుండా సబ్‌కాంట్రాక్టర్లకు అప్పగించడంతో అర్ధాంతరంగా నిలిచిపోతున్నట్టు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. దీంతో గ్రామాల్లో నీటి ఎద్దడి యథాతథంగా ఉంటోందన్నారు. జలజీవన్ మిషన్,ఇతర పథకాల వివరాలను ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లకు అందించాలని కోరారు. రహదారి పనులు ఉపాధి పథకంలో మెటీరియల్ కాంపోనెంట్‌తో ప్రారంభించిన పనులు చురుగ్గా సాగుతున్నాయన్నారు. ఈ సమయంలో దాదాపు రూ. 9 కోట్లు బకాయిలు నిలిచిపోవడంతో కాంట్రాక్టర్లు పనులు పూర్తికి వెనుకడుగు వేస్తున్నారనిబస్కీ సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు పాడి, రమేశ్, రామన్న, బొండాం సర్పంచ్ భాస్కరరావు, గన్నెల సర్పంచ్ తదితరులు ఇంజనీరింగ్ అధికారులను ప్రశ్నించారు. ఈ సమస్యను ఎమ్మెల్యే కలెక్టర్‌దృష్టికి తీసుకువెళ్లాలని కోరారు. తహసీల్దార్ ఎంవీఎస్ ప్రసాద్ మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులో వచ్చిన పి ర్యాదుల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు మ్యూటేషన్ చేసేందుకు రెవెన్యూ సిబ్బంది వేలరూపాయలు డిమాండ్ చేస్తున్నారని ఆరోపించారు.అరకులోయ పట్టణంలో కొందరు బినామీ నాయకులు స్థలాలను ఆక్రమించి, విక్రయిస్తున్నారన్నారు. ఎంఈవో మాట్లాడుతూ మండలం లో ఆరు అప్పర్ ప్రైమరీ పాఠశాలలకు కేంద్రప్రభుత్వం వసతిగృహాలను మం జూరు చేసిందని వివరాలు తెలిపారు. ఐసీడీఎస్ పీవో శారద మాట్లాడుతూ బాల్యవివాహాలను నిరోధించాలన్నారు. ఈ సమావేశంలో ఎక్సైజ్ సీఐ మాట్లాడు తూ సారా నిర్మూలనకు ప్రజా ప్రతినిధులు సహకరించాలని కోరారు. పలువురు ఎంపీటీసీ సభ్యులు ఆనందరావు, శత్రుఘ్న, భీమరాజులు మాట్లాడుతూ గ్రామాల్లో సారాతో పాటు బెల్ట్‌షాపులు అరికట్టాలని సూచించారు. లబ్ధిదారులతో వేలిముద్రలువేయించుకుని రేషన్ సరఫరా చేయడంలేదని పెదలబుడు ఎంపీటీసీ సభ్యుడు ఆనందరావు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ఎంపీడీవో లవరాజు పాల్గొన్నారు.

ప్రొటోకాల్ పాటించండి: ఎమ్మెల్యే మత్స్యలింగం

అధికారులు సమన్వయంతో పనిచేసి సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం ఈసందర్భంగా అధికారులను ఆదేశించారు. తాగునీటి ఎద్దడి నివారించాలన్నారు. గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో ఎంపీటీసీలు, సర్పంచ్‌లను ,వార్డు మెంబర్లను భాగస్వాములను చేయాలన్నారు. ప్రొటోకాల్ పాటించకుంటే చర్యలుతీసుకుంటామన్నారు.

కార్యకర్తల కృషితోనే కూటమికి అధికారం

» టీడీపీ పాడేరు నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి



కార్యకర్తలతో మాట్లాడుతున్న గిడ్డి ఈశ్వరి

పాడేరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): పార్టీ కార్యకర్తల కృషితోనే కూటమి అధికారంలోకి వచ్చినట్టు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి అన్నారు. ఆమె స్వగృహంలో బుధవారం నిర్వహించిన కార్యకర్తే అధినేత కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పార్టీని ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు, ప్రజా సమస్యల పరిష్కారంలో, ఎన్నికల్లో విజయానికి కార్యకర్తలు పడుతున్న శ్రమ ఎంతో ఉంటుందన్నారు. వారి కృషి, పట్టుదలతోనే టీడీపీ నేడు 43 ఏళ్ల రాజకీయ ప్రస్థానాన్ని దక్కించుకుందన్నారు. దీంతో కార్యకర్తలకు ప్రాధాన్యత నీయడంతో పాటు నేతల దృష్టికి తీసుకువస్తున్న ప్రజల సమస్యలను అధికారులకు తెలియజేస్తామన్నారు. కార్యకర్తలు అంకితభావంతో పని చేస్తూ ప్రజలకు మరింత చేరువగా ఉండాలన్నారు వారికి ఎటువంటి కష్టం వచ్చినా పార్టీ అండగా ఉంటుందని ఆమె భరోసా ఇచ్చారు. ఈసందర్భంగా గ్రామాల్లోని వివిధ సమస్యలపై కార్యకర్తలు సమర్పించిన వినతులను ఆమె స్వీకరించారు. కొయ్యూరు మండలం డౌనూరు పంచాయతీ ధర్మవరంలో స్థానిక ఎంపీటీసీ సభ్యుడు అప్పారావు, పబ్లిక్ బోరును తన ఇంట్లో వేయించుకోవడంతో గ్రామంలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు వస్తున్నాయని పలువురు తెలిపారు.కొయ్యూరు మండలం కొమ్మిక పంచాయతీ గంగవరంనకు రోడ్డు వేయాలని తదితర సస్యలపై టీడీపీ కార్యకర్తలు గిడ్డి ఈశ్వరికి వినతిపత్రాలను అందజేశారు. ఈకార్యక్రమంలో టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలుపర్తి గోవిందరావు, టీడీపీ సీనియర్ నేతలు జీసీసీ మాజీ ఛైర్మన్ ఎంవీవీ ప్రసాద్, జీసీసీ డైరెక్టర్ బొర్రా నాగరాజు, జడ్పీటీసీ మాజీ సభ్యులు నళిని, మాజీ ఎంపీపీ బొర్రా విజయరాణి, తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు డప్పోడి వెంకటరమణ, నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన టీడీపీ మండల కమిటీల అధ్యక్ష, కార్యకర్తలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ జాతరకు ప్రత్యేక ఏర్పాట్లు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ అనుషదేవి, జడ్పీటీసీ సభ్యుడు బాలయ్య తదితరులు

చింతపల్లి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక గ్రామ దేవత ముత్యాలమ్మ జాతరకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్టు స్థానిక ఎంపీపీ కోరాబు అనుషదేవి అన్నారు. బుధవారం అమ్మవారి ఆలయంలో ఉత్సవ కమిటీ, గ్రామ పెద్దలతో కలిసి ఎంపీపీ, జడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య జాతర పోస్టర్లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఈనెల 24 నుంచి 27 వరకు అమ్మవారి జాతర అత్యంత నిర్వహించనున్నట్టు చెప్పారు. ప్రధానంగా నాలుగు రోజులు ఆలయంలో ప్రత్యేక పూజలు జరుగుతాయన్నారు. అమ్మవారిని దర్శించుకునేందుకు మైదాన ప్రాంతాలు, పొరుగు జిల్లాలు, రాష్ట్రాల నుంచి 2 లక్షలమంది భక్తులు వస్తారని అంచనావేశామన్నారు. ఆలయంలో భక్తులు విశ్రమించేందుకు మండపాలు,బారికెడ్లు ఏర్పాటు చేస్తామన్నారు. ప్రధాన రహదారి లో పలు చోట్ల తాగునీరు కొళాయిలు, తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నాలుగు రోజులు పారిశుద్ధ్య పనులకు అదనపు సిబ్బందిని నియమించాలని కలెక్టర్‌ని కోరామన్నారు. ప్రత్యేక వైద్యశిబిరం, ప్రభుత్వ స్టాళ్ల ఏర్పాటుకు వివరించారు. ఈకార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు దురియా హేమంత్ కుమార్, ప్రధాన కార్యదర్శి పసుపులేటి వినాయకరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి పెదిరెడ్ల బేతాళుడు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వివిధ మండలాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

పాడేరురూరల్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): పాడేరు డివిజన్ పరిధిలోని వివిధ మండలాల్లోని గ్రామాలకు ఈ నెల 11వ తేదీ శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏపీఈపీడీసీఎల్ పాడేరు విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఏవీఎస్ఎం అప్పారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాడేరు మండలం కిండంగి విద్యుత్ సబ్ స్టేషన్‌లో వంట్లమామిడి ఫీడర్ మరమ్మతులు నేపథ్యంలో వంట్లమామిడి, మినుములూరు, మల్కాపొలంమోదాపల్లి గ్రామాలకు విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు. పెదబయలు మండలం రూడకోట ఫీడర్‌లో రూడకోట, అడుగులపుట్టు, తమరాడ, లక్ష్మీపేట, గోమంగి గ్రామాలకు, దారకొండ సబ్ స్టేషన్‌లో దారకొండ, చిన్నఅగ్రహారం, పెద్దఅగ్రహారం గ్రామాలకు విద్యుత్ సరఫరా అంతరాయం ఉంటుందన్నారు. జి.మాడుగుల పరిధి నుర్మతి ఫీడర్ పరిధి నుర్మతి, బీరం, కిల్లంకోట, సింగర్భ గ్రామాలకు, డుంబ్రిగడ సబ్ స్టేషన్ పరిధిలోని కురిడి ఫీడర్‌లో కురిడి, కొర్రాయి, సొవ్వ, సాగర, గసభ, కొల్లాపుట్టు గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుంది

నేటి నుంచి ఎండవల్లి సబ్‌స్టేషన్ పరిధిలో..

పాడేరు డివిజన్ పరిధిలోని 132 కేవీ ఎండపల్లివలస విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు నేపథ్యంలో ఈ నెల 10వ తేదీ నుంచి 18వ తేదీ వరకు ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఇంజనీర్ ఏవీఎస్ఎం అప్పారావు ఒక ప్రకటనలో తెలిపారు. 132 కేవీ అరకు- పాడేరు ఫీడర్ సర్క్యూట్-1, ఫీడర్ సర్కూట్ -2లలో ఒక సర్క్యూట్‌లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ముంటుందన్నారు. వినియోగదారుల సహకరించాలని ఆయన కోరారు.

మండుతున్న ఎండలు...

»పాడేరులో అత్యధికంగా 39 డిగ్రీలు

పాడేరు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో ఎండలు మండుతున్నాయి. దీంతో ఏజెన్సీ వాసులు సైతం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. తెల్లవారుజామున కాస్తా చల్లదనంగా ఉంటున్నప్పటికీ, మిలిగిన సమయంలో వేడి ప్రభావం చూపుతున్నది. ముఖ్యంగా పగటి వేళల్లో ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది. దీంతో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఏజెన్సీలో బుధవారం జిల్లా కేంద్రం పాడేరులో 39.0 డిగ్రీల సెల్సియస్ గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదుకాగా కొయ్యూరులో 35.8, పెదబయలులో 34.6, ముంచంగిపుట్టు, జీకేవీధిలో 33.6,డుంబ్రిగుడ, చింతపల్లిలో 32.5, అరకులోయ, హుకుంపేటలో 32.3, అనంతగిరిలో 30.1, .జి.మాడుగులలో 29.6 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

అంతుచిక్కని వ్యాధితో మూగజీవాలు మృతి

పెదబయలు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో పశువులు అర్థాంతరంగా మృతి చెందుతుండడంతో రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. బుధవారం గ్రామానికి చెందిన డడియ త్రినాధ్‌కు చెందిన పోతు మృతి చెందింది. పంచాయతీకి చెందిన క్లాప్ మిత్రలు బుజ్జిబాబు, గెన్ను, పొట్టి, కార్తీక్ మృతి చెందిన పోతును సమీప మత్స్య గడ్డ పక్కన పూడ్చిపెట్టారు.ఈ నెల 6న ఆవు అర్థాంతరంగా మృత్యువాత పడింది. అయితే, ప్లాస్టిక్ కవర్లను, పేపర్లు తి నటంతోనే పశువుల మృతి చెందుతున్నట్టు పశువైద్య సిబ్బంది చెబుతున్నారు.

ఎమ్మెల్సీ 'గాదె'కు సన్మానం



ఎమ్మెల్సీ శ్రీనివాసులు నాయుడును సన్మానిస్తున్న దృశ్యం

పాడేరురూరల్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా ఎన్నికై మొట్ట మొదటి సారిగా బుధవారం పాడేరు పర్యటనకు వచ్చిన గాదే శ్రీనివాసుల నాయుడును స్థానిక ఆదివాసీ ఉద్యోగుల భవనంలో అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం నాయకులు ఘనంగా ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సన్మానకార్యక్రమంలో సంఘం నాయకులు ముఖి శేషాద్రి, కిముడు దేముళ్ళనాయుడు, కిల్లో గంగన్నపడాల్, తిరుపతిరావు, కాంతారావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాంగి రాజారావు పాల్గొన్నారు.

ఉచిత కుట్టు శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానం

పాడేరురూరల్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్, ఈడబ్ల్యూఎస్ సహకారంతో అందిస్తున్న ఉచిత కుట్టు శిక్షణ (టైలరింగ్)కు మహిళలు దరఖాస్తులు చేసుకోవాలని ఎంపీడీవో జె.తేజరతన్ ఒక ప్రకటనలో తెలిపారు. పాత పాడేరు సచివాలయంలో 90 రోజులు ఉచితం ఈ శిక్షణ అందిస్తామన్నారు. అనంతరం 75 శాతం హాజరు ఉన్న మహిళలకు కుట్టు మిషన్ ఉచితంగా ప్రభుత్వం అందిస్తుందన్నారు. సర్టిఫికెట్ అందిస్తారన్నారు. ఆ సక్తి గల 18 నుంచి 45 ఏళ్ల వయస్సుగల మహిళలు ఆధార్ కార్డు, రేషన్ కార్డు తదితర ధ్రువపత్రాలతో ఎంపీడీవో కార్యాలయంలో నమోదు చేసుకోవాలన్నారు.

వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించాలి

పాడేరురూరల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): గ్రామ రెవెన్యూ సహాయకులు (వీఆర్‌ఏలు) సమస్యలు పరిష్కారానికి అధికారులు సహకరించాలని సంఘం మండల నాయకుడు వల్లా లింగమూర్తి కోరారు. వీఆర్‌ఏలు బుధవారం తహసీల్దార్ వంజంగి త్రినాథరావు నాయుడుకు వినతిపత్రం అందించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 8 ఏళ్లగా విధులు నిర్వహిస్తున్న తమకు ఇప్పటికి వేతనాలు పెంచక ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నామన్నారు. తెలంగాణాలో గత మూడేళ్లగా పే స్కేల్ ప్రకారం జీతాలు చెల్లిస్తున్నారన్నారు.

గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకోవాలి

» ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ సూర్యలక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రాజెక్టు డైరెక్టర్ సూర్యలక్ష్మి

చింతపల్లి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ ఎస్. సూర్యలక్ష్మి అన్నారు. బుధవారం తాజంగి గ్రామ పంచాయతీ కేంద్రంలో ఏడో పోషణ పక్షోత్సవంలో భాగంగా గర్భిణులకు సీమంతాలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ పోషణ పక్షోత్సవాలు ఈనెల 22 వరకు జరుగుతాయన్నారు. నాలుగు అంశాలపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించాలన్నారు. వెయ్యి రోజుల సంరక్షణలో భాగంగా గర్భందాల్చిన రోజు నుంచి శిశువుకి రెండేళ్ల వయస్సు వచ్చే వరకు అంగన్‌వాడీ కార్యకర్తల పర్యవేక్షణ ఉంటుందన్నారు. గర్భిణులంతా ఆస్పత్రిలో ప్రసవం పొందడం, శిశువులకు తల్లి ముర్రుపాలు పట్టించాలన్నారు. శిశువుకి క్రమంగా టీకాలు వేయించాలన్నారు. పోషణ ట్రాకర్‌లో నమోదుపై అవగాహన కల్పించాలన్నారు. పిల్లల్లో పోషకాహార లోపం నివారించడానికి కమ్యూనిటీ ఆధారిత నిర్వాహణ కార్యక్రమం (సీఎంఏఎం) అమలు చేయాలన్నారు. పిల్లల్లో ఊబకాయం నియంత్రణకు ఆరోగ్య కరమైన జీవనశైలి, మంచి అలవాట్లు పాటించేలా అవగాహన కల్పించాలన్నారు. గర్భిణులు, బాలింతలకు టీహెచ్‌ఆర్ సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం పక్షోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించి బాలసం జీవని కిట్లు, సంపూర్ణపోషణ కిట్లు, పాలు, పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో సీడీపీవో జీవీ రమణ, ఏసీడీపీవో ఎం. రామలక్ష్మి, వైద్యాధికారి జి. భావాని, ఎంపీహెచ్‌ఈవో స్వామి మాజీ సర్పంచ్‌లు డి. రామస్వామి, పి. కాంతమ్మ, మహిళా కానిస్టేబుల్ హిమబిందు, సూపర్‌వైజర్లు గౌహరున్నీష, కె. విజయకుమారి, ఎస్.గౌరి, పి. అప్పలనర్స పాల్గొన్నారు.

ఫీజు చెల్లించలేదని వార్షిక పరీక్షలకు నిరాకరణ

» తల్లిదండ్రుల ఆందోళన... ఎంఈవో విచారణ



నేతాజీ ఇంగ్లీష్ మీడియం పాఠశాల ప్రిన్సిపాల్‌ను విచారణ చేపడుతున్న ఎంఈవో

ముంచంగిపుట్టు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఫీజు బకాయి ఉందన్న నెపంతో స్థానిక నేతాజీ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో కొంత మంది విద్యార్థులకు బుధవారం ప్రారంభమైన వార్షిక పరీక్షలను రాయించలేదు. ఎల్‌కేజీ నుంచి 6వ తరగతి వరకు తరగతికి కొంత మంది చొప్పున సుమారు 40 మంది విద్యార్థులకు ఇంగ్లీషు పరీక్షకు అనుమతించలేదు. దీంతో ప్రిన్సిపాల్ విజదాసు తీరుపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని ఎంఈవో కృష్ణమూర్తి దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే ఆయన పాఠశాలను సందర్శించి జరిగిన సంఘటనపై విచారణ చేపట్టారు. 40 మంది విద్యార్థులను ఎందుకు పరీక్ష అనుమతించలేదని ప్రిన్సిపాల్‌ని ప్రశ్నించారు. ఫీజు వ్యవహారం విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుకోవాలని, విద్యార్థులకు పరీక్షలకు నిరాకరిస్తే సహించేది లేదన్నారు. ఇదే వైఖరి కొనసాగిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇకపై విద్యార్థులకు ఇబ్బందిలేకుండా చూడాలని ప్రిన్సిపాల్‌కు సూచించారు. దీంతో బుధవారం పరీక్ష రాయని విద్యార్థులకు యథావిధిగా గురువారం నుంచి పరీక్షలు రాయిస్తామని ప్రిన్సిపాల్ ఎంఈవోకి చెప్పారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీలు అనిల్, సురేశ్, గౌరీశంకర్,హరి తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో నిత్యావసరాలను డీఆర్ డిపోలకు తరలింపు

గూడెంకొత్తవీధి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): నిత్యవసర సరకులను సకాలంలో డీఆర్ డిపోలకు తరలించాలని స్థానిక తహసీల్దార్ టి. రామకృష్ణ అన్నారు. బుధవారం మండల కేం ద్రంలోని జీసీసీ ఎంఎల్ఎస్ పాయింట్‌ని ఆమె తనిఖీ చేశారు. రేషన్ బియ్యం నిల్వ, రిజిస్ట్రేర్లను పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ ప్రతి నెలా ఒకటో తేదీ నుంచి ఎండీయూ ఆపరేటర్లు ద్వారా బియ్యం పంపిణీకి అనువుగా నెలాఖరులోనే డీఆర్ డిపోలకు సరకులను పంపించాలన్నారు. ఎండీయూ ఆపరేటర్ కచ్చిత తూకంతో బియ్యం పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో ఎంఎల్ఎస్ పాయింట్ ఇన్‌చార్జి వీరభద్రం పాల్గొన్నారు.

మారుమూల ప్రాంతాల అభివృద్ధికి కృషి : ఎంపీపీ

జి.మాడుగుల, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : మారుమూల ప్రాంతాలను అభివృద్ధి చేస్తున్నట్టు ఎంపీపీ అప్పలరాజు పేర్కొన్నారు. బుధవారం ఆయన నుర్మతి పంచాయతీ కేంద్రం, డిప్పలగొంది గ్రామాల్లో మంజూరైన సీసీ రోడ్లను ప్రారంభించారు. ఉపాధి నిధులతో నుర్మతిలో రూ.4 లక్షలు, డిప్పలగొందిలో రూ.8లక్షల అంచనా వ్యయంతో ఈ నిర్మాణాలు చేపడుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సూరిబాబు, ఉప సర్పంచ్ వరలక్ష్మి, కూటమి నాయకులు త్రిమూర్తులు, బొంజుబాబు, ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ మత్స్యకొండబాబు, పెసా కమిటీ ఉపాధ్యక్షుడు శ్రీను కాఫీ సిబ్బంది గుండుదొర, తదితరులు పాల్గొన్నారు.

గిగ్ - ఫ్లాట్ ఫారం కార్మికుల ఉచిత నమోదు

పాడేరురూరల్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): గిగ్ - ఫ్లాట్ ఫారం కార్మికుల నమోదును ఈ నెల 17వ తేదీలోగా చేసుకోవాలని కార్మికశాఖ జిల్లా అసిస్టెంట్ సహాయ కమిషనర్ టి.సుజాత ఒక ప్రకటనలో తెలిపారు. స్విగ్గి, జోమాటో తదితర ఫ్లాట్‌పారంలో ఆహార సరఫరాలో పనిచేస్తున్న కార్మికులు, అమెజాన్, ఫ్లిప్కార్ట్, లాజిస్టిక్స్ సరఫరా కార్మికులు, ఊబర్, ఓలా రాపిడో రవాణా కార్మికులు, ప్రెస్, ప్రింట్ మీడియాలో పనిచేసే ఫ్రీలాన్సర్ కార్మికులు ఆన్‌లైన్ లింక్ ద్వారా లేదా సమీపంలోని సీఎస్‌సీ, మీసేవ, సచివాలయ కేంద్రాలలో లేదా కార్మికశాఖ నిర్వహించే ఈ ప్రత్యేక శిబిరాలలో నమోదు చేసుకోవచ్చని తెలిపారు.

12న విశాఖలో విద్యుత్ ఉద్యోగుల సదస్సు



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

చింతపల్లి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ రంగం ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా, కాంట్రాక్టు కార్మికులు, ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 12న విశాఖలో తలపెట్టిన ఉత్తరాంధ్ర సదస్సును విజయవంతం చేయాలని జిల్లా విద్యుత్ ఉద్యోగులు, కాం ట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికుల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు బోనంగి చిన్నయ్య పడాల్ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక విద్యుత్ ఉప కేంద్రంలో సదస్సు పోస్టర్లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలపై ఉద్యమ కార్యాచరణ ఈ సదస్సులో నిర్ణయిస్తామన్నారు. ఈకార్యక్రమంలో సంఘం నాయకులు రాజబాబు, ప్రసాద్, సత్యనారాయణ, శేఖర్ పాల్గొన్నారు.

మా గ్రామానికి పక్కా రహదారి నిర్మించండి

» పాతపాడు గ్రామస్థుల నిరసన



పాతపాడుకు వెళ్లే రోడ్డు దుస్థితి



రోడ్డుపై నిరసన వ్యక్తం చేస్తున్న పాతపాడు గ్రామస్థులు

పెదబయలు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుంతుర్ల పంచాయతీ పాతపాడు గ్రామానికి పక్కా రహదారి సౌకర్యం కల్పించాలని కోరుతూ బుధవారం గ్రామస్థులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ గ్రామ సమస్యలను పరిష్కరించటంలో పాలకులు, అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. వెనుబడిన పీవీటీజీ కులానికి చెందిన తమపై చిన్న చూపు తగదన్నారు. ఇటీవల గ్రామానికి పీఎం జన్‌మన్ పథకం కింద గృహాలు మంజూరయ్యాయని, అయితే, సిమెంట్, ఇసుక, ఇటుక తదతర నిర్మాణ సామగ్రి తరలించేందుకు సరైన రోడ్డు లేక గృహ నిర్మాణాలు చేసుకోలేకపోతున్నామన్నారు. గ్రామంలో ఎవరైనా అనారోగ్యం బారినపడితే ఆ స్పత్రికి తరలించటానికి తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నామన్నారు. డోలీ ద్వారా ఆస్పత్రికి తరలించాల్సి వస్తోందని వాపోయారు. రోడ్డు సదుపాయం లేక గ్రామంలో రేషన్ వాహనం రావటం లేదని తెలిపారు. గుర్రాలతో రేషన్ సరుకులు తీసుకువస్తున్నామని చెప్పారు. గ్రామంలో తాగునీటి సౌకర్యం లేదని, పాఠశాల భవనం లేదన్నారు. అధికారుల చుట్టూ ప్రదర్శనలు చేసినా పట్టించుకునే నాథుడే కరువయ్యారని వాపోతున్నారు. ఇకనైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి కుంతుర్ల పంచాయతీ కేంద్రం నుంచి పాతపాడు మీదగా కందులగుంట గ్రామం వరకు పక్కా రహదారి కల్పించాలని మణుగూరి బాబూజీ,బాబూరావు, చిన్నారావు, పాంగి చిట్టిబాబు, గంగరాజు, గణేశ్, శాస్త్రీబాబు, చిన్నాలు దొర,అప్పలరాజు తదితరులు డిమాండ్ చేశారు.

టీడీపీ శ్రేణుల సమస్యలపై ప్రత్యేక దృష్టి : పీలా



కార్యకర్తల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న పీలా గోవింద

అనకాపల్లి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని టీడీపీ శ్రేణుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీలా గోవింద సత్యనారాయణ తెలిపారు. బుధవారం ఇక్కడి కార్యాలయంలో నాయకులు, కార్యకర్తల నుంచి అర్జీలను స్వీకరించారు. పలువురితో స్వయంగా మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ప్రతి అర్జీపై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు సబ్బవరపు గణేశ్, గొంతిన శ్రీనివాసరావు, కర్రి బాబి, పోలారపు త్రినాథ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

'చంద్రబాబు పాలనలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మెరుగు'



టీడీపీ శ్రేణుల సమావేశంలో మాట్లాడుతున్న రత్నాకర్

అనకాపల్లి టౌన్ : ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు బాధ్యతలు చేపట్టిన తర్వాత రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మెరుగుపడిందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ అన్నారు. బుధవారం లక్ష్మీనారాయణనగర్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటైన కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను ప్రజలకు వివరించాల్సిందిగా సూచించారు. పార్టీ నాయకులు బొడ్డపాటి చినరాజారావు, వేగి దొరబాబు, జెర్రిపోతుల ధర్మారావు, దాడి ఈశ్వరరావు, వామాల కాశీ, పోలిన సత్యారావు, కోడూరు త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

అపార్టుమెంట్లలో సీసీ కెమెరాలు తప్పనిసరి : సీఐ



నరసింగరావుపేటలో అపార్టుమెంట్ వాసులతో మాట్లాడుతున్న సీఐ

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : అపార్టుమెంట్లలో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని పట్టణ సీఐ టీవీ విజయ్‌కుమార్ సూచించారు. బుధవారం పలు అపార్టుమెంట్లకు వెళ్లి వాటిలో నివాసం ఉంటున్న వారితో సమావేశమయ్యారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే కలిగే ప్రయోజనాలను వివరించారు. నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఎంతో దోహదపడతాయన్నారు. ఈ దిశగా అంతా చర్యలు చేపట్టాలన్నారు. ఆయన వెంట పట్టణ ఎస్ఐ ఎ.వెంకటేశ్వరరావు, సిబ్బంది ఉన్నారు.

ముఖ్య కూడళ్లలో గ్రీన్ షెల్టర్లు ఏర్పాటు



కాంప్లెక్స్ వద్ద ఏర్పాటు చేసిన గ్రీన్ షెల్టర్

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : పల్లెల నుంచి అనకాపల్లిలోని వివిధ ప్రాంతాలకు వచ్చే ప్రజల సౌకర్యార్థం జీవీఎంసీ అధికారులు ముఖ్య కూడళ్లలో గ్రీన్ షెల్టర్‌లను ఏర్పాటు చేశారు. ఆర్టీసీ కాంప్లెక్స్, నెహ్రూచౌక్, రైల్వే స్టేషన్, సుంకరమెట్ట జంక్షన్ తదితర ప్రాంతాల్లో ఇప్పటికే వీటిని అందుబాటులోకి తీసుకొచ్చారు. వేసవి తాపంతో ప్రజలు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు వీటిని ఏర్పాటు చేస్తున్నట్టు ఈఈ ఎస్.శేఖర్ తెలిపారు. మరో రెండు రోజుల్లో ఆయా ప్రాంతాల్లో చలివేంద్రాలు కూడా ఏర్పాటు చేస్తామన్నారు.

బొట్టవానిపాలెం వద్ద స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటుకు వినతి

పరవాడ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : గాజువాక- ఎలమంచిలి ప్రధాన రహదారిలోని బొట్టవానిపాలెం వద్ద స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారిలో ఇటీవల కాలంలో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇరవైరోజుల వ్యవధిలో రెండు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. ఒక ప్రమాదంలో యువకుడు మృతిచెందగా, మరో ప్రమాదంలో ఇద్దరు ఫార్మా ఉద్యోగులకు గాయాలయ్యాయి. స్పీడ్ బ్రేకర్లు లేకపోవడం వల్ల వేగంగా వాహనాలు రాకపోకలు సాగిస్తుండడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని వాపోతున్నారు. అలాగే రహదారికి ఆనుకొని నివాసాలు ఉన్నాయి. ఈ క్రమంలో ఏదైనా పనిమీద వెళ్లేటప్పుడు రహదారి దాటాలంటే గ్రామస్థులు హడలిపోతున్నారు. ఆర్అండ్‌బీ శాఖ అధికారులు తక్షణమే స్పందించి స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలని గ్రామస్థులంతా కోరుతున్నారు.

రక్షణ లేని రక్షిత భవనాలు

- తీర ప్రాంత గ్రామాల్లో పలు చోట్ల భయపెడుతున్న తుఫాన్ షెల్టర్లు
- పట్టించుకునేవారు లేక శిథిలావస్థకు చేరిక
- ఇళ్లు, పాఠశాలలకు ఆనుకుని కొన్ని ఉండడంతో భయాందోళన



నాయుడుపాలెంలో శిథిలావసకు చేరిన తుఫాన్ రక్షిత భవనం



వాడచీపురుపల్లి పంచాయతీ దళాయిపాలెంలో...



నాయుడుపాలెం పంచాయతీ వెంకటపతిపాలెంలో...

పరవాడ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్‌లు, సునామీలు వంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు తీరప్రాంత ప్రజల రక్షణ కోసం ప్రభుత్వం నిర్మించిన భవనాలు ప్రస్తుతం ప్రమాదకరంగా మారాయి. దశాబ్దాల క్రితం నిర్మించిన వీటికి ఏళ్ల తరబడి మరమ్మతులు చేపట్టకపోవడంతో శిథిలావస్థకు చేరుకున్నాయి. ఎప్పుడు కూలిపోతాయో తెలియని పరిస్థితిలో ఉండడంతో ఆయా గ్రామాల ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ప్రమాదాలు జరగక ముందే వాటిని నేలమట్టి చేయాలని కోరుతున్నారు. మండలంలోని వాడచీపురుపల్లి పంచాయతీ దళాయిపాలెం, నాయుడుపాలెం పంచాయతీ వెంకటపతిపాలెం, నాయుడుపాలెం గ్రామాల్లో దశాబ్దాల క్రితం ప్రభుత్వం తుఫాన్ రక్షిత భవనాలను నిర్మించింది. తీవ్ర వాయుగుండాలు ఏర్పడినప్పుడు, తుఫాన్లు వంటివి సంభవించినప్పుడు ముందస్తు జాగ్రత్త చర్యగా అధికారులు ఆయా గ్రామాల ప్రజలను అది కారులు తుఫాన్ రక్షిత భవనాల్లోకి తరలించి ఆహారం, తాగునీరు వంటి వాటిని అందించేవారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా లోపాలతో పాటు తీర ప్రాంతం కావడంతో ఉప్పు గాలులకు భవనాలు పాడైపోయాయి. వీటిని పరిశీలించి ఎప్పటికప్పుడు మరమ్మతు పనులు చేపట్టకపోవడంతో క్రమేణా శిథిలావస్థకు చేరుకున్నాయి. కొన్ని భవనాలు నివాసాలకు, పాఠశాలలకు చేరువలో ఉండడం మరింత ఆందోళన కలిగిస్తుంది. దీంతో ఏ క్షణంలో ఇవి కూలిపోతాయోనని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. శిథిలావస్థకు చేరిన ఇటువంటి భవనాలను ఉన్నతాధికారులు గుర్తించి, తక్షణమే తొలగించేలా ఏర్పాట్లు చేయాలని అంతా కోరుతున్నారు.

కేసుల పురోగతిని సీసీటీఎన్ఎస్‌లో నమోదు చేయాలి

- డ్రోన్‌ల ద్వారా ట్రాఫిక్ నియంత్రణ చేపట్టండి
- గంజాయి లభించే ప్రాంతాలు, సేవించే వారి వివరాలు సేకరించండి
- నెలవారీ నేర సమీక్ష సమావేశంలో ఎస్పీ తుహిన్‌సిన్హా



నెలవారీ నేర సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి రూరల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : కేసుల పురోగతిని ఎప్పటికప్పుడు క్రైమ్ అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ సిస్టమ్ (సీసీటీఎన్ఎస్)లో నమోదు చేయాలని ఎస్పీ తుహిన్ సిన్హా అధికారులను ఆదేశించారు. ఇక్కడి జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం నెలవారీ నేర సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ముందుగా జిల్లాలోని పోలీస్ స్టేషన్ల వారీగా నమోదు చేసిన కేసులకు సంబంధించి పురోగతిని ఆయా అధికారుల ద్వారా తెలుసుకున్నారు. భవిష్యత్తులో అన్ని రివ్యూ మీటింగ్‌లు సీసీటీఎన్ఎస్ ఆధారంగా నిర్వహించనున్నందున ఎస్ఐలు, సీఐలు, డీఎస్పీలు ఈ విధానంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. డ్రోన్‌ల ద్వారా ట్రాఫిక్ నియంత్రణతో పాటు పండుగలు, జాతరల వద్ద నిఘా పెంచాలని సూచించారు. పేకాట, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, చట్టవ్యతిరేక కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. మిస్సింగ్ కేసుల్లో ఎటువంటి ఆలస్యం లేకుండా తక్షణమే కేసులు నమోదు చేసి దర్యాప్తు చేయాలని సూచించారు. గంజాయి లభించే ప్రాంతాలు, సేవించేవారి వివరాలు సేకరించి జిల్లా పోలీస్ కార్యాలయానికి పంపాలన్నారు. అనంతరం విధి నిర్వహణలో ప్రతిభ చూపిన అధికారులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఏఎస్పీలు దేవప్రసాద్, మోహనరావు, డీఎస్పీలు పోతిరెడ్డి శ్రీనివాసరావు, శ్రావణి, వి.విష్ణుస్వరూప్ తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో జోనల్ కమిషనర్ పర్యటన



కూరగాయల మార్కెట్‌లో పర్యటిస్తున్న జడ్సీ రమణ

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పలు ప్రాంతాల్లో జీవీఎంసీ జోనల్ కమిషనర్ బీవీ రమణ బుధవారం విస్తృతంగా పర్యటించారు. కూరగాయల మార్కెట్‌కు తొలుత వెళ్లారు. అక్కడ ఎక్కడపడితే అక్కడ చెత్త ఉండడాన్ని చూసి తక్షణమే తొలగించాని ఆదేశించారు. మధ్యాహ్నం వేళల్లో పట్టణంలోని కాలువల్లో పూడికతీత పనులు చేపట్టాలన్నారు. పారిశుధ్యం మెరుగుకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. అనంతరం ఎన్టీఆర్ వైద్యాలయం వద్ద గల అన్న క్యాంటీన్‌ను తనిఖీ చేశారు. ఆహార పదార్థాలను పరిశీలించారు. అక్కడ అల్పాహారం తింటున్న వారితో మాట్లాడి పదార్థాల నాణ్యతను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట జీవీఎంసీ అధికారులు ఉన్నారు.

వైభవోపేతంగా నూకాంబిక అమ్మవారి జాతర



స్టేడియంలో చిన్నారుల నృత్యప్రదర్శన



నూకాంబికను దర్శించుకుంటున్న సీఎంఆర్ అధినేత వెంకటరమణ దంపతులు

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : ఉత్తరాంధ్రుల ఆరాధ్య దేవత అనకాపల్లి నూకాంబిక ఆలయంలో కొత్త అమావాస్య జాతర వైభవోపేతంగా జరుగుతోంది. ఇందులో భాగంగా బుధవారం సాయంత్రం అమ్మవారిని సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ దంపతులు దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన వీరికి ఉత్సవ కమిటీ చైర్మన్ పీలా నాగశ్రీను స్వాగతం పలికి బాలాలయంలోని అమ్మవారికి పూజలు చేయించారు. అనంతరం సత్కరించి నూకాంబిక చిత్రపటాన్ని, ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఇదిలావుంటే, ఈ వేడుకల్లో భాగంగా ఎన్టీఆర్ స్టేడియంలో బుధవారం రాత్రి ప్రదర్శించిన ఆధ్యాత్మిక కార్యక్రమాలు అలరించాయి. తొలుత ఈ ప్రదర్శనలను సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం మల్కాపురానికి చెందిన కోలాటాలు, విజయవాడకు చెందిన చిన్నారుల నృత్య ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ పీలా నాగశ్రీను, కూటమి నాయకులు తాడి రామకృష్ణ, సకల గోవింద్, బొలిశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బలిజపాలెంలో ఘనంగా దుర్గమాంబ వేడుక



పూజలందుకున్న దుర్గమాంబ

సబ్బవరం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : నారపాడు శివారు బలిజపాలెంలో దుర్గమాంబ ఆలయ వార్షికోత్స వం బుధవారం అత్యంత ఘనంగా జరిగింది. వేకువజామున అమ్మవారికి విశేష అలంకరణలు, పూజలు చేపట్టిన అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు. రాత్రికి ఏర్పాటైన ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు అల రించాయి. పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు సోదరుడు వెంకటేశ్వరరావు, వైసీపీ నేత గండి రవికుమార్, వైస్ ఎంపీపీ-2 మామిడి లక్ష్మి, సర్పంచ్ మామిడి శంకరరావు, నాయకులు బలిరెడ్డి అప్పారావు, సాలాపు వెంకటేశ్వరరావు, ఇందలి రమణ, బైలపూడి దేముడుబాబు, శరగడం రాము, దుర్గఅప్పారావు, యడ్ల నాయుడులతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

నేడు గొర్లివానిపాలెంలో బంగారుమాంబ పండుగ



బంగారుమాంబ

పరవాడ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : గొర్లివానిపాలెం ప్రజల ఆరాధ్య దేవత బంగారుమాంబ అమ్మవారి పండుగను గురువారం నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి ఉత్సవ కమిటీ పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. ప్రధాన రహదారి నుంచి ఆలయం వరకు విద్యుద్దీపాలంకరణ చేపట్టారు. ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. వేకువజాము నుంచి విశేష పూజలు ప్రారంభం కానున్నాయి. పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలకు 13న పరీక్ష

కశింకోట/సబ్బవరం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తాళ్లపాలెంలో గల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయంలో ఈ నెల 13న ప్రవేశాలకు పరీక్ష నిర్వహించనున్నామని ప్రిన్సిపాల్ డాక్టర్ జి.గ్రేస్ బువారం తెలిపారు. ఐదో తరగతి, ఇంటర్ ఫస్టియర్‌లో చేరే వారికి ఈ ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నామని వివరించారు. విద్యార్థులు తప్పనిసరిగా హాల్ టిక్కెట్టుతో పాటు ఆధార్ కార్డు జిరాక్స్ కాపీతో హాజరు కావాలని ఆమె సూచించారు. పూర్తి వివరాలకు విద్యాలయాన్ని సంప్రదించాల్సిందిగా కోరారు. అలాగే, సబ్బవరంలోని అంబేడ్కర్ గురుకుల విద్యాలయంలో ఐదో తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు కూడా పదమూడో తేదీన ప్రవేశ పరీక్ష ఉంటుందని ప్రిన్సిపాల్ ఎన్.రామకృష్ణ తెలిపారు. ఆ రోజు ఉదయం పది గంటల నుంచి పన్నెండు గంటల వరకూ ఐదో తరగతి, మధ్యాహ్నం రెండు గంటల నుంచి నాలుగున్నర గంటల వరకు ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశ పరీక్ష ఉంటాయన్నారు. అరగంట ముందుగా విద్యార్థులు పరీక్షా కేంద్రానికి చేరుకోవాల్సిందిగా సూచించారు.

కాంగ్రెస్ పార్టీ అనకాపల్లి మండల అధ్యక్షుడిగా నూకఅప్పారావు



నూకఅప్పారావు

తుమ్మపాల, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్‌పార్టీ అనకాపల్లి మండల అధ్యక్షుడిగా కట్టమూరి నూకఅప్పారావు రెండోసారి ఎన్నికయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు మీసాల సుబ్బన్న నుంచి బుధవారం నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా నూకఅప్పారావు మాట్లాడుతూ మండలంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ, ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటాలు సాగిస్తానని స్పష్టం చేశారు. తనపై నమ్మ కం ఉంచి ఈ పదవి అప్పగించిన పార్టీ అధిష్ఠానానికి కృతజ్ఞతలు తెలిపారు.

శ్రీరామ్‌నగర్ కాలనీలో అధ్వానంగా వీధి రోడ్లు



శ్రీరామ్‌నగర్ కాలనీలో అధ్వానంగా ఉన్న వీధి రోడ్లు

లంకెలపాలెం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 85వ వార్డు పరిధి శ్రీరామ్‌నగర్ కాలనీలో వీధి రోడ్లు అధ్వానంగా మారాయి. కాలనీ ఏర్పాటై సుమారు రెండు దశాబ్దాలు గడుస్తున్నా పూర్తి స్థాయిలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు లేకపోవడంతో నివాసితులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షం వస్తే రోడ్లు చిత్తడిగా మారుతున్నాయి. డ్రైనేజీలు లేకపోవడంతో వాడిక నీరు రహదారిపైకి చేరుతోంది. దీంతో ఇంట్లో నుంచి బయటకు రాలేని పరిస్థితి ఏర్పడుతోందని అక్కడివారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో పలు వీధుల్లో సీసీ రోడ్లు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం కొండ పైభాగంలో గల నివాస ప్రాం తంలో గల వీధులతో పాటు కాలనీకి వెళ్లే మార్గం మట్టి రోడ్లు కావడంతో ఇబ్బందులు పడుతున్నామని చెబుతున్నారు. జీవీఎంసీ అధికారులు స్పం దించి వీధి రోడ్లను సీసీ రోడ్లుగా అభివృద్ధి చేయాలని అంతా కోరుతున్నారు.

సీపీఐ నేత చంద్ర రాజేశ్వరరావుకు నివాళి



రాజేశ్వరరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ శ్రేణులు

తుమ్మపాల, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : సీపీఐ పూర్వపు జాతీయ ప్రధాన కార్యదర్శి చండ్ర రాజేశ్వరరావు ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు అన్నారు. రాజేశ్వరరావు వర్ధంతిని బుధవారం ఇక్కడ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం మాట్లాడారు. విపత్కర పరిస్థితుల్లో సేవలందించేందుకు జన సేవాదళ్ విభాగాన్ని స్థాపించి దేశప్రజలకు విశేష సేవలందించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోరిబిల్లి శంకరరావు, వియ్యపు రాజు, విత్తనాల పోతురాజు, గోవింద, సూరిబాబు, బుజ్జి, ఈశ్వరరావు, జగదీష్, సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

రైల్వే ఆసుపత్రి ఏర్పాటు చేయాలి

- ఏఐఆర్‌ పీడబ్ల్యూఎఫ్ జనరల్ సెక్రటరీ శ్రీనివాసరావు

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని రైల్వేస్టేషన్ ప్రాంతంలో రైల్వే ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని ఆలిండియా రైల్వే పెన్షనర్స్ వెల్ఫేర్ ఫెడరేషన్ విజయవాడ డివిజన్ జనరల్ సెక్రటరీ జీవీఎన్ శ్రీనివాసరావు కోరారు. బుధవారం ఇక్కడ ఫెడరేషన్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దువ్వాడ నుంచి సామర్లకోట వరకు సౌత్ కోస్ట్ రైల్వే విశాఖపట్నం డివిజన్‌లో విలీనం చేయాలని, కరోనా సమయంలో 18 నెలల డీఏ ఎరియర్స్ వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పలువురు సభ్యులు పలు సమస్యలు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. వాటి పరిష్కారానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఫెడరేషన్ విజయవాడ డివిజన్ అధ్యక్షుడు రామ్‌గోపాల్, కార్యదర్శి ఎ.కామేశ్వరరావు, తుని బ్రాంచ్ అధ్యక్షుడు జి.రమేష్‌బాబు, అనకాపల్లి బ్రాంచ్ కార్యదర్శి భీశెట్టి శ్రీనివాసరావులతో పాటు జీవీఎన్ సాగర్, ఎస్వీ రమణ, ఎ.జోగినాయుడు, కె.రామకృష్ణ పాల్గొన్నారు.

చినబాబు కాలనీలో సీసీ డ్రైన్ నిర్మించాలని వినతి

తుమ్మపాల, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : మేజర్ పంచాయతీ తుమ్మపాల మెయిన్ రోడ్డులో సీసీ డ్రైన్‌ను తక్షణమే నిర్మించాలని టీడీపీ సీనియర్ నాయకుడు సందిన చినబాబు కోరారు. బుధవారం టీడీపీ కార్యాలయంలో రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చినబాబు మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వ హయాంలో చినబాబుకాలనీలో సీసీ మెయిన్ డ్రైన్ నిర్మాణానికి రూ.మూడు కోట్లు మంజూరు చేశారన్నారు. అనంతరం జరిగిన ఎన్నికల్లో ప్రభుత్వం మారడంతో మంజూరైన నిధులను వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. దీంతో కాలనీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు.

తీరంలో సాగర్ కవచ్


పూడిమడక తీరంలో పోలీసు అధికారులు

అచ్యుతాపురం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): మెరైన్, నేవీ, శాంతి భద్రతల విభాగం పోలీసులు బుధవారం సాగర్ కవచ్ కార్యక్రమాన్ని అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల పరిధిలో గల తీరప్రాంతాల్లో నిర్వహించారు. సాగర మార్గం ద్వారా ఉగ్రవాదులు, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడే వాళ్లు వస్తే వారిని గుర్తించి ఎలా పట్టుకోవాలనే దానిపై రెండు రోజులు ఎక్సర్‌సైజ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఈ సందర్భంగా పూడిమడక తీరంలో భారీగా పోలీసులు మోహరించారు. పూడిమడక తీరం నుంచి అచ్యుతాపురం వైపు వెళ్లే మార్గాల్లో పోలీసు బందోబస్తు ఏర్పాటుచేసి వాహనాలను తనిఖీ చేశారు. 88 మంది పోలీస్ సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పరవాడ డీఎస్పీ విష్ణు స్వరూప్, అనకాపల్లి దిశ డీఎస్పీ శ్రీనివాస్, మెరైన్ సీఐ సింహాద్రి నాయుడు, అచ్యుతాపురం సీఐ నమ్మి గణేశ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

ఉద్యోగ మేళా వార్షిక క్యాలెండర్ ఆవిష్కరణ

అనకాపల్లి కలెక్టరేట్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ 2025-26 సంబంధించి ఉద్యోగ మేళా వార్షిక క్యాలెండర్‌ను కలెక్టర్ విజయకృష్ణన్ బుధవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. గత నెల 25, 26 తేదీల్లో నిర్వహించిన కలెక్టర్ల సమావేశంలో సీఎం చంద్రబాబునాయుడు ఆదేశాల ప్రకారం ఈ వార్షిక క్యాలెండర్‌ను విడుదల చేసినట్టు ఆమె తెలిపారు. క్రమం తప్పకుండా జిల్లాలో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో నెలలో రెండు ఉద్యోగ మేళాలను ప్రజాప్రతినిధులు, అధికారులను సమన్వయం చేసుకొని నిర్వహించాలని ఆమె సూచించారు.

కిరండూల్ రైళ్ల గమ్యాల కుదింపు

విశాఖపట్నం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): కిరండూల్- కొత్తవలస (కేకే) లైన్‌లో ఆధునికీకరణ పనులు చేపడుతున్న నేపథ్యంలో విశాఖ-కిరండూల్ మధ్య రాకపోకలు సాగించే రైళ్ల గమ్యాలను తాత్కాలికంగా కుదించామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. విశాఖ-కిరండూల్ మధ్య నడిచే 58501, 58502 నంబర్లు గల పాసింజర్ రైళ్లు ఈ నెల 14 నుంచి 22 వరకు విశాఖ-అరకు మధ్య రాకపోకలు సాగిస్తాయని పేర్కొన్నారు. అరకు-కిరండూల్ మధ్య రాకపోకలను రద్దు చేశామన్నారు. అలాగే విశాఖ-కిరండూల్ మధ్య నడిచే 18515, 18516 నంబర్లు గల నైట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఈ నెల 15 నుంచి 23 వరకు విశాఖ-దంతెవాడ మధ్య నడుస్తాయన్నారు. దంతెవాడ-కిరండూల్ మధ్య రాకపోకలను తాత్కాలికంగా రద్దు చేశామని పేర్కొన్నారు. ఈ మార్పులను ప్రయాణికులు గమనించాలని ఆయన కోరారు.

ప్రభుత్వ ఉద్యోగుల పుట్టినిల్లు.. తోటలూరు

- గ్రామంలోని వంద ఇళ్లు.. ప్రతి ఇంట్లో ఓ ఉద్యోగి
- పూర్వీకుల పట్టుదలతో అందరూ విద్యావంతులే


తోటలూరు గ్రామం

కొయ్యూరు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని రావణాపల్లి పంచాయతీ శివారు తోటలూరు గ్రామం.. ఈ ఊరికి ఓ ప్రత్యేక ఉంది. కేవలం వంద ఇళ్లు ఉండే ఈ ఊరిలోని ప్రతి ఇంట్లో ఓ ప్రభుత్వ ఉద్యోగి ఉన్నారు. యాభై ఏళ్ల క్రితం వ్యవసాయ కూలీలుగా జీవనం సాగించిన ఇక్కడి ప్రజలు ముందు తరాలు ఇలా కాకూడదని చదువుపై దృష్టి పెట్టారు. తమ పిల్లలను బాగా చదివించడంతో ఇప్పుడు ఊర్లో ప్రభుత్వ కొలువులు సాధించినవారు ఎక్కువ మందే ఉన్నారు.

తోటలూరు గ్రామంలో యాభై ఏళ్ల క్రితం సరైన రవాణా, విద్యుత్ సౌకర్యం ఉండేవికావు. వంద ఇళ్లు ఉండే ఈ గ్రామంలో అందరూ వ్యవసాయ కూలీలుగానే జీవనం సాగించేవారు. పిల్లలను బాగా చదివించి ప్రయోజకులను చేయాలని గ్రామస్థులు నిర్ణయించుకున్నారు. గ్రామంలో ఎయిడెడ్ పాఠశాల ఉన్నా ఆర్థిక స్థోమత లేక మండల కేంద్రంలోని కేంద్రీకృత ఆశ్రమ పాఠశాల, వైఎన్ పాకలు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో పిల్లలను చదివించారు. అప్పట్లో ఆశ్రమ పాఠశాలల నిర్వహణ సక్రమంగా ఉండకపోవడం, పర్యవేక్షణ అంతంతమాత్రంగా ఉండడంతో విద్యార్థులకు సరైన తిండి కూడా ఉండేది కాదు. చాలామంది విద్యార్థులు ఇళ్లకు వచ్చేసేవారు. అప్పట్లో గ్రామ పెద్దలు ఆ పిల్లలకు నచ్చజెప్పి.. తల్లిదండ్రులు పడుతున్న కష్టాన్ని వారికి ప్రత్యక్షంగా చూపించి బడికి వెళ్లడానికి ప్రోత్సహించారు. ఈ గ్రామంలో తొలిసారిగా పొడుగు ఎర్రయ్య అనే వ్యక్తికి జీసీసీ సేల్స్‌మన్‌గా ఉద్యోగం వచ్చింది. మరో నలుగురికి ప్రభుత్వ ఉద్యోగాలు వచ్చాయి. ఇదే స్ఫూర్తితో మరికొందరు కష్టపడి చదివి ప్రభుత్వ ఉద్యోగాలు పొందారు. ప్రస్తుతం ఈ గ్రామంలో 90 మందికి పైగా వివిధ ప్రభుత్వ రంగ సంస్థల్లో ఉద్యోగాలు చేస్తున్నారు. ఒక్క ఉపాధ్యాయ వృత్తిలోనే 20 మంది కొనసాగుతున్నారు. ఆర్టీసీలో డ్రైవర్, కండక్టర్లుగా ఏడుగురు, వైద్య, ఆరోగ్యశాఖలో ఏడుగురు, విశాఖ పోర్టులో ఇద్దరు, పోలీస్‌శాఖలో నలుగురు, మహిళా, శ్రీ సంక్షేమశాఖలో నలుగురు, విశాఖ స్టీల్ ప్లాంట్‌లో పది మంది, ఇలా పలు ప్రభుత్వ రంగ సంస్థలో ఉద్యోగాలు చేస్తున్నారు. ఈ గ్రామంలో అందరూ విద్యావంతులే కావడం విశేషం.

పూర్వీకుల ప్రోత్సాహంతో..



తోటలూరు చదువులకు పుట్టినిల్లు. పూర్వీకుల ప్రోత్సాహంతో మా తరం నుంచి విద్యావంతులు పెరిగారు. ప్రభుత్వ పాఠశాలలో ప్రాథమిక, ఉన్నత విద్య అభ్యసించాను. తల్లితండ్రుల కృషి వల్ల పట్టుదలతో పోలీస్ ఉద్యోగం సాధించాను. ఇప్పుడు జీవితంలో స్థిరపడ్డాను.

- కాకురు నాగమణి, హెడ్ కానిస్టేబుల్, తోటలూరు

మా ఇంట్లో నలుగురు టీచర్లు



మా కుటుంబంలో అందరం చదువుకున్నాం. మా తల్లిదండ్రులకు చదువు విలువ తెలియడంతో మా ఇంట్లోని నలుగురిని బాగా చదివించారు. ఒకరిని చూసి ఒకరు చదువుల్లో పోటీ పడేవాళ్లం. దీంతో నలుగురం ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతున్నాం. మా పిల్లలను ఉన్నత చదువులకు ప్రోత్సహిస్తున్నాం.

- శ్యామల భరత్‌కుమార్, ఉపాధ్యాయుడు





విద్యార్థి దశలోనే చట్టాలను అధ్యయనం చేయాలి

- ఏపీ హైకోర్టు న్యాయమూర్తి వీఆర్‌కే కృపాసాగర్


మాట్లాడుతున్న న్యాయమూర్తి కృపాసాగర్

సబ్బవరం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశలోనే చట్టాలను అధ్యయనం చేయాలని న్యాయ విద్యార్థులకు ఏపీ హైకోర్టు న్యాయమూర్తి వీఆర్‌కే కృపాసాగర్ సూచించారు. స్థానిక దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో బుధవారం 'న్యాయ విద్య- న్యాయవాద వృత్తి' అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోర్సు పూర్తయి బయటకు వెళితే ఎవరూ పట్టించుకోరని, కాలేజీ సమయాన్ని సద్వినియోగం చేసుకొని వర్సిటీలో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. అందుకు తగిన వాతావరణం ప్రతి వర్సిటీలో ఉంటుందన్నారు. దేశంలో ఉన్న హైకోర్టుల తీర్పులు, సుప్రీం కోర్టు తీర్పులపైన కూడా అధ్యయనం చేయాలన్నారు. కాలానుగుణంగా వచ్చే మార్పులు, తీర్పులపై అవగాహన పెంచుకుంటే న్యాయవాద వృత్తిలో విజయవంతంగా రాణించవచ్చునన్నారు. అంతకు ముందు వీసీ ప్రొఫెసర్ డి.సూర్యప్రకాశరావు అధ్యక్షోపన్యాసం చేశారు. అనంతరం వీఆర్‌కే కృపాసాగర్‌ను వీసీ జ్ఞాపికతో సత్కరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ విశ్వచంద్రనాథ్ మాదాసు, పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భీమిలి బీచ్ రోడ్డులో డబుల్ డెక్కర్ బస్సులు

- కింద క్లోజ్డ్ డోర్స్, పైన ఓపెన్ టాప్...
- వారం రోజుల్లో రాక

విశాఖపట్నం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో పర్యాటక రంగానికి కొత్త రంగులు అద్దడానికి జిల్లా యంత్రాంగం ప్రయత్నం చేస్తోంది. బీచ్ రోడ్డులో 'హాప్ ఆన్,హాప్ ఆఫ్' బస్సులు నడిపితే బాగుంటుందని ఏపీ టూర్స్ అండ్ ట్రావెల్స్ ప్రతినిధులు చాలాకాలంగా సూచిస్తున్నారు. దీనిపై ప్రస్తుత కలెక్టర్ హరేంధిర ప్రసాద్ దృష్టిపెట్టారు. విశాఖపట్నం పోర్టుతో సంప్రతింపులు జరిపి పర్యావరణ సామాజిక బాధ్యత కింద రెండు ఎలక్ట్రిక్ బస్సులు ఇవ్వాలని కోరగా, పోర్టు యాజమాన్యం అంగీకరించింది. ఇవి డబుల్ డెక్కర్ బస్సులు. పూర్తి ఏసీ కలిగి ఉంటాయి. కింద క్లోజ్డ్ డోర్స్‌తో, పైన ఓపెన్ టాప్‌తో ఉంటాయి. వీటి ఖరీదు ఒక్కొక్కటి సుమారు రూ.1.8 కోట్లు. వీటితో పాటు అశోక్ లేల్యాండ్ నుంచి ఒక ఏసీ బస్సు వస్తుంది. రాష్ట్ర ప్రభుత్వానికి ఆ సంస్థ కొన్ని ఏసీ బస్సులు ఇవ్వడానికి ముందుకు రాగా అందులో ఒకటి విశాఖపట్నం పంపుతామని అమరావతి అధికారులు తెలిపారు. దీంతో కలుపుకొని మొత్తం మూడు బస్సులు పర్యాటక శాఖకు అందనున్నాయి. వీటిని బీచ్ రోడ్డులో ఫిషింగ్ హార్బర్ నుంచి భీమిలి వరకూ నడుపుతారు.

ఆరు నెలల్లో మూడు హత్యలు


పట్ట పగలు బహిరంగ ప్రదేశంలో మద్యం సేవిస్తున్న యువకులు

నర్సీపట్నం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): నర్సీపట్నంలో ఆరు నెలల వ్యవధిలో మూడు హత్యలు జరగడం సంచలనంగా మారింది. ఇవన్నీ మద్యం మత్తులో జరిగినవి కావడంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. గత ఏడాది నవంబరు 17వ తేదీ అర్ధరాత్రి కొత్తవీధి ఎంపీపీ స్కూల్ సమీపంలో ప్రైవేటు ఎలక్ట్రీషియన్ సర్వసుద్ధి నాగేశ్వరరావు హత్యకు గురయ్యాడు. ఈ కేసులో ఇద్దరు నిందితులతోపాటు హత్యకు గురైన నాగేశ్వరరావు కూడా మద్యం మత్తులో ఉండడం గమనార్హం. డిసెంబరు 29 తేదీన వెంకునాయుడుపేటలో కఠారి రమణ, తన కుమారుడు భాస్కర్‌ను హత్య చేశాడు. ఇద్దరూ కలిసి మద్యం సేవించి, ఆ మత్తులో ఉండగా ఆర్థిక లావాదేవీలపై గొడవ జరిగింది. దీంతో రమణ సన్నికల్లు రాయితో భాస్కర్‌ను కొట్టి చంపేశాడు. తాజాగా అయ్యన్నకాలనీలో నూకాలమ్మ పండగలో జరిగిన గొడవ ఒక యువకుడి హత్యకు దారితీసింది.

విచ్చలవిడిగా మద్యం బెల్టు షాపులు, ఓపెన్ బార్లు

నర్సీపట్నంలో మద్యం బెల్టు షాపులు, ఓపెన్ బార్లు (బహిరంగ ప్రదేశాల్లో) అధికమయ్యాయి. పోలీసులు పట్టించుకోకపోవడంతో నానాటికీ పెరిగిపోతున్నాయి. మద్యం మత్తులో గొడవలకు దిగి కొట్టుకుంటున్నారు. అయితే వీటిపై పోలీసు స్టేషన్‌కు ఫిర్యాదులు అందడంలేదు. కొన్నిసార్లు గొడవ ముదిరి.. హత్యకు దారితీస్తున్నది. పాకలపాడు నుంచి చీడిగుమ్మల వచ్చే దారిలో పోలవరం సమీపంలోని మద్యం దుకాణం వద్ద ఓపెన్ బార్ నడుస్తున్నది. నర్సీపట్నంలో బ్రిటీష్ అధికారుల సమాధులు ఉన్న అల్లూరి స్మారక ప్రదేశంలో పట్టపగలు మద్యం సేవిస్తున్నారు. నర్సీపట్నంలో ఒక వైన్ షాపు వద్ద కిళ్లీ బడ్డీ పెట్టించి అక్కడ మద్యం సేవించడానికి అనుమతి ఇస్తున్నారు. ఇక మద్యం బెల్టు షాపుల గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. పోలీసులు, ఎక్సైజ్ శాఖల అధికారులు.. మద్యం షాపుల యజమానుల నుంచి నెలవారీ మామూళ్లు తీసుకుంటూ, బెల్టు షాపుల నిర్వాహకులు, బహిరంగంగా మద్యం సేవించే వారిపై చర్యలు తీసుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాగా ఏజెన్సీకి ముఖద్వారం కావడంతో నర్సీపట్నంలో చాపకింద నీరులా గంజాయి విక్రయాలు, సేవించడం పెరుగుతున్నట్టు చెబుతున్నారు. నర్సీపట్నంలో గత కొంతకాలం జరుగుతున్న పరిణామాలను పోలీసు ఉన్నతాధికారులు తీవ్రంగా పరిగణించి మద్యం బెల్టు షాపులు, ఓపెన్ బార్లపై కఠిన చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

అచేతనంగా అగ్నిమాపక కేంద్రాలు

... 5వ పేజీ తరువాయి

అగ్ని ప్రమాదాలు, రసాయనాల లీకేజీలు జరుగుతుంటాయి. పరవాడ ఫార్మా సిటీలో రాంకీ తరపున ఒకటి, అచ్యుతాపురం సెజ్‌లో ఏపీఐఐసీ నిర్వహణలో ఒకటి చొప్పున అగ్నిమాపక కేంద్రాలు వున్నాయి. అయితే ఇవి ఆయా పరిశ్రమల్లో జరిగే అగ్ని ప్రమాదాలను నివారించడానికి మాత్రమే ఉపయోగపడుతుంటాయి. ఈ మండలాల్లోని గ్రామాల్లో అగ్ని ప్రమాదాలు జరిగితే అనకాపల్లి, గాజువాక, ఎలమంచిలి నుంచి అగ్నిమాపక శకటాలు రావాల్సిందే.

బోరు పాడై ఏడు నెలలైంది

సిబ్బందికి రెండేళ్ల నుంచి జీతాల్లేవు!

నక్కపల్లి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): సుమారు రెండు దశాబ్దాల క్రితం నక్కపల్లిలో ప్రైవేటు ఏజెన్సీ ఆధ్వర్యంలో అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. శకటం నిలుపుదలకు నిర్మించిన రేకుల షెడ్డు శిథిలావస్థకు చేరుకుంది. దీనికి ఆనుకుని సిబ్బందికి చిన్నపాటి గది మాత్రమే వుంది. బోరు మోటారు ఎనిమిది నెలల క్రితం పాడైపోయింది. దీంతో హెటెరో ఔషధ పరిశ్రమలోకి వెళ్లి శకటంలోకి నీటిని నింపుకుంటున్నారు. సిబ్బంది కొరత లేదు. ప్రైవేటు ఏజెన్సీ కావడంతో సిబ్బంది అరకొరగా జీతాలు చెల్లిస్తున్నారు. అవి కూడా రెండేళ్ల నుంచి అందడంలేదు.

పరాయి పంచన సబ్బవరం కేంద్రం

సబ్బవరం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక అగ్నిమాపక కేంద్రానికి సొంత భవనం లేదు. రెవెన్యూ శాఖకు చెందిన ఖాళీగా వున్న ఆర్‌ఐ క్వార్టర్‌లో నిర్వహిస్తున్నారు. అధికారి, సిబ్బందితో కలిపి 16 మంది ఉండాలి. కానీ రెండు పోస్టులు ఖాళీగా వున్నాయి. సొంతగూడు కోసం ప్రభుత్వం రూ.1.25 కోట్లు మంజూరు చేసింది. రెవెన్యూ అధికారులు అసకపల్లి సర్వే నంబరు-1లో 50 సెంట్లు కేటాయించారు.


నక్కపల్లిలో అగ్నిమాపక కేంద్రం


మోటారు లేని బోరు



ఆర్‌ఐ క్వార్టర్‌లో నిర్వహిస్తున్న సబ్బవరం అగ్నిమాపక కేంద్రం

క్రైం... crime news

రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

పాయకరావుపేట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): గుల్లిపాడు, నర్సీపట్నం రోడ్డు రైల్వే స్టేషన్ల మధ్య రైలు నుంచి ఓ గుర్తు తెలియని వ్యక్తి ప్రమాదవశాత్తూ జారిపడి అక్కడికక్కడే మృతిచెందాడు. దీనికి సంబంధించి తుని రైల్వే పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ జి.శ్రీనివాసరావు అందజేసిన వివరాలిలా వున్నాయి. గుల్లిపాడు, నర్సీపట్నం రైల్వే స్టేషన్ల మధ్య తుని నుంచి అనకాపల్లి వైపు వెళుతున్న రైలు నుంచి సుమారు 45 సంవత్సరాల వయస్సుగల వ్యక్తి ప్రమాదవశాత్తూ జారిపడి అక్కడికక్కడే మృతి చెందాడు. అతని ఒంటిపై నీలం రంగు జీన్ ప్యాంటు, నల్ల రంగు టీషర్టు, ఎడమచేతి మణికట్టు వద్ద జ్యోతి అని పచ్చబొట్టు తప్ప ఎటువంటి ఆధారాలు లభించలేదు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని, మృతదేహాన్ని తుని ఏరియా ఆస్పత్రికి తరలించి మార్చురీ గదిలో భద్రపరిచామని, మృతుడి వివరాలు తెలిసినవారు తుని ప్రభుత్వ రైల్వే పోలీస్ స్టేషన్‌లో సంప్రతించాలని ఎస్‌ఐ కోరారు.

ప్రమాదవశాత్తూ బావిలో పడి యువకుడి మృతి

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జాతీయ రహదారిలోని ఆవఖండం ప్రాంతంలోని నేలబావిలో ఓ యువకుడు బుధవారం ఉదయం ప్రమాదవశాత్తూ నీట మునిగి మృతి చెందినట్టు ఫిర్యాదు అందిందని పట్టణ ఎస్‌ఐ ఏ వెంకటేశ్వరరావు తెలిపారు. దీనికి సంబంధించి ఆయన తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. పట్టణంలోని చినబజార్‌కు చెందిన కాలేపు సాయిగణేశ్(30) విప్రో కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. బుధవారం ఉదయం ఐదు గంటలకు స్నానం చేసి వస్తానని ఇంట్లోంచి బయలుదేరాడు. అలా బయలుదేరిన అతను డైట్ కళాశాలకు ఎదురుగా గల ఆవఖండం ప్రాంతంలోని నేలబావిలో స్నానానికి దిగి మునిగిపోయాడు. ఎంతసేపటికీ రాకపోవడంతో కుటుంబ సభ్యులు గాలించారు. బావి వద్ద అతని ద్విచక్ర వాహనం కనిపించడంతో ప్రమాదం జరిగి ఉంటుందని పోలీసులకు సమాచారం అందించారు. అగ్నిమాపకశాఖ అధికారి పి. నాగేశ్వరరావు ఆధ్వర్యంలో సిబ్బంది సంఘటనా స్థలానికి వెళ్లి బావిలో ఉన్న మృతున్ని బయటకు తీశారు. మృతుని సోదరుడు చంద్రశేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

రాంబిల్లి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. దీనికి సంబంధించి రాంబిల్లి ఎస్‌ఐ నాగేంద్ర తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. అచ్యుతాపురం మండలం ఎస్ఈజెడ్ కాలనీ గురుజాపాలేనికి చెందిన పంచదార్ల చిన్నాజీ(26) మంగళవారం రాత్రి మరో వ్యక్తితో కలిసి జంగాలపాలెం జంక్షన్ సమీపంలోని పెట్రోల్ బంక్ నుంచి ఎస్ఈజెడ్ పునరావాస కాలనీకి బైక్‌పై వస్తున్నాడు. ఈ క్రమంలో వెంకటాపురం నుంచి రాంబిల్లి వైపు వస్తున్న వ్యాన్ వీరి బైక్‌ను ఢీకొంది. దీంతో చిన్నాజీకి తీవ్రగాయాలు కావడంతో 108 అంబులెన్స్‌లో అనకాపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

రసాయనాలు మీద పడి యువకుడికి అస్వస్థత
ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి


పడాల హరినాథ్ (ఫైల్ ఫొటో)

పరవాడ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఫార్మా రసాయనాల ఖాళీ డ్రమ్ములను వ్యాన్ నుంచి దించుతుండగా ఓ యువకుడు తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే దుకాణ యజమాని అతడిని విశాఖలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. దీనికి సంబంధించి సీఐ ఆర్.మల్లికార్జునరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బుచ్చెయ్యపేట మండలం నీలకంఠాపురం గ్రామానికి చెందిన పడాల హరినాథ్(22) రోజు వారీ కూలి పనులకు వెళుతుంటాడు. మంగళవారం రాంబిల్లి మండల పరిధిలోని ఆస్టర్ పరిశ్రమలో ఖాళీ డ్రమ్ములను తోటి కూలీలతో కలిసి వ్యాన్‌లో ఎక్కించాడు. వాటిని పరవాడలోని ఒక తుక్కు దుకాణం వద్ద కిందకు దించుతున్న క్రమంలో ఒక డ్రమ్ములో నుంచి కొద్దిపాటి రసాయనాలు హరినాథ్‌పై పడ్డాయి. దీంతో అస్వస్థతకు గురై స్పృహ కోల్పోయాడు. దుకాణ యజమాని వెంటనే కూర్మన్నపాలెంలోని ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం విశాఖలోని ఒక ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో బుధవారం తెల్లవారుజామున మృతిచెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

వృద్ధురాలి అనుమానాస్పద మృతి

నక్కపల్లి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉద్దండపురం గ్రామానికి చెందిన ఓ వృద్ధురాలు అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. ఇందుకు సంబంధించి ఎస్‌ఐ సన్నిబాబు తెలిపిన వివరాలిలా వున్నాయి. ఉద్దండపురానికి చెందిన ఆవాల సురేశ్, వెలంశెట్టి శ్రీను వేర్వేరు ట్రావెల్ బస్సుల్లో డ్రైవర్లుగా పనిచేస్తున్నారు. వీరి మధ్య ఇటీవల గొడవ జరిగింది. ఈ నెల 4న గ్రామ పెద్దల సమక్షంలో పంచాయితీ కూడా జరిగింది. ఈ నెల 7న సురేశ్ తల్లి లక్ష్మికి కడుపునొప్పి రావడంతో నక్కపల్లి ఆస్పత్రికి, అక్కడ నుంచి తునిలో ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అయినా నొప్పి తగ్గకపోవడంతో మంగళవారం విశాఖ కేజీహెచ్‌కు తరలిస్తుండగా దారిలో మృతిచెందింది. వెలంశెట్టి శ్రీను తనను, తన తల్లిని కొట్టి గాయపరిచాడని, ఆమె మృతికి కారణం అతనే అంటూ సురేశ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. లక్ష్మి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్ మార్చురీకి తరలించారు. నివేదిక అనంతరం తదుపరి చర్యలు తీసుకుంటామని, ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

ప్లైఉడ్ పరిశ్రమలో అగ్నిప్రమాదం

రాంబిల్లి/అచ్యుతాపురం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్ఈజడ్‌లోని రుషిల్ డెకార్ ప్లైఉడ్ పరిశ్రమలో మంగళవారం రాత్రి అగ్నిప్రమాదం సంభవించింది. ఈ పరిశ్రమ పది రోజులుగా షట్‌డౌన్‌లో ఉంది. మంగళవారం రాత్రి ట్రయల్ నిర్వహిస్తున్న సమయంలో అగ్నిప్రమాదం జరిగింది. పరిశ్రమలో మండే స్వభావం గల కెమికల్స్ ఉండడంతో మంటలు వ్యాపించాయి. రెండు అగ్నిమాపక శకటాలు వచ్చి మంటలను అదుపులోకి తెచ్చాయి. లేకపోతే పెద్ద మొత్తంలో వున్న కలప దగ్ధం అయ్యేది. సీఐ నర్సింగరావు, ఎస్‌ఐ నాగేంద్ర ప్లైఉడ్ కంపెనీకి వెళ్లి పరిశీలించారు.

50 ఎకరాల్లో సరుగుడు తోటల దగ్ధం


దగ్ధమైన సరుగుడు తోటలు

బుచ్చెయ్యపేట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతపాక గ్రామం సోమయాజుల చెరువు వద్ద సరుగుడు తోటల్లో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. సర్వే నంబర్లు రెండు, మూడు, 41, 42, 43, 44, 45లలో చింతపాక, గున్నెంపూడి, గొంప గ్రామాల చెందిన సుమారు 25 మంది రైతులు సాగుచేసుకుంటున్న సుమారు 50 ఎకరాల సరుగుడు తోటలు కాలి బూడిదయ్యాయి. వీటితోపాటు రెండు వ్యవసాయ విద్యుత్ మోటార్లు దగ్ధమయ్యాయి. సమాచారం అందుకున్న రావికమతం అగ్నిమాపకదళం వచ్చి మంటలను అదుపు చేశారు. కానీ అప్పటికే చాలా వరకు కాలిపోయింది. అగ్నిప్రమాదానికి కారణం ఏమిటో తెలియదని రైతులు చెబుతున్నారు. వీఆర్‌వో సోమిరెడ్డి రమణ, వీఆర్‌ఏ బొడ్డు శ్రీను వచ్చి, సరుగుడు తోటలకు వాటిల్లిన నష్టాన్ని అంచనా వేశారు. అనంతరం తహసీల్దార్ ఎం.లక్ష్మికి లిఖితపూర్వంగా నివేదించారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	98.00
లైవ్ ధర	118.00
విత్ స్కిన్	206.00
స్కిన్ లెస్	216.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	435
విజయనగరం	439
శ్రీకాకుళం	439